

# సూర్య

నేటి దినపత్రిక

18వ వసంతంలోకి

www.suryaa.com



**అనంతపురం | శ్రీ సత్యసాయి**

గురువారం | 13 ఫిబ్రవరి 2025 | పేజీలు 15


05

# యమ డేంజర్

పొంచి ఉన్న పెను ప్రమాదం

పట్టించుకోని ఉన్నతాధికారులు

గుణపాఠం నేర్వని అధికార యంత్రాంగం

ప్రమాదం జరిగితే ప్రాణాలు అంతే సంగతి..

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఫైర్ జరిగితే రోగుల ప్రాణాలు గాలిలో దీపాలే!!






---

ఖాకీ కనుసైగల్లో.. పురంలో విచ్చలవిడిగా జూదం.

మట్కా,పేకాట నిర్వాహకులతో లక్షలాది రూపాయలు మామూళ్లు



# ఎస్పీ మేడం హిందూపురం వైపు చూడండి..

బాలయ్య ఇలాకలో, జూదంపై అడ్డుకట్ట వేయలేరా..?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందూపురం నియోజకవర్గానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బావమరిది ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిత్యం వహిస్తున్న హిందూపురంలో మట్కా, జూదం మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోందని పెద్ద ఎత్తున ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఒక డీఎస్పీ,నలుగురు సర్కిల్ ఇన్స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో పేకాట, పై ఏమాత్రం పట్టించుకోకపోవడం పై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో జూదం కేంద్రాల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చిన ఎలాంటి అడ్డుకట్ట కూడా వేయలేకపోతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**హిందూపురం మేజర్ న్యూస్:**

ఎస్పీ ఒక్కసారి హిందూపురం పట్టణం, మండలం లో జరుగుతున్న పేకాట స్థావరాల నిఘా వేసి జూదం కేంద్రాలను అరికట్టాలంటూ ప్రజలు కోరుతున్నారు. హిందూపురం నియోజకవర్గం లో కొంతమంది జూదం నిర్వాహకులతో పోలీస్ శాఖలో కొంతమంది చేతులు కలపడంతో అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా పేకాట, మట్కా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో హిందూపురం మండలం గొల్లపురం, తూముకుంట, ముదిరెడ్డిపల్లి, కొల్లకుంట ప్రాంతాల్లో మొబైల్ ద్వారా ఫోన్లో మాట్లాడుకుని ఒక ప్రాంతాన్ని ఎంచుకొని పెద్ద ఎత్తున జూదాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వేకువ జామున మొబైల్ ఫోన్లో ప్లాన్ చేసుకొని పేకాట స్థావరానికి చేరుకొని లక్షలాది రూపాయలు గ్యాంబ్లింగ్ ఆడిస్తున్నట్లు సమాచారం. ఈ గ్యాంబ్లింగ్, మట్కా కు సంబంధించి కొంతమేర పర్సంటేజ్ పోలీస్ శాఖ లో పనిచేస్తున్న కొంతమందికి ముట్ట చెబుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో పోలీసుల సైతం ఎక్కడా గానీ పేకాట స్థావరాలపై దాడులు గాని అరెస్టులు గాని చేసిన దాఖలాలు కూడా ఏమాత్రం లేదు.

ఇటీవల కాలంలో హిందూపురం మున్సిపాలిటీ ప్రాంతంలో కొంతమంది నకిలీ డాక్యుమెంట్ల తో భూ కబ్జాలకు పాల్పడుతుంటే వివాదాస్పద భూములను టార్గెట్ చేసుకొని ఒక ఇద్దరు సిఐలు స్టేషన్ కే పరిమితమవుతూ సివిల్ సెటిల్మెంట్లు చేసుకుని ప్రజల సమస్యలపై ఎలాంటి ఫోకస్ పెట్టడం లేదంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మిగతా 2లో

---



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీచేసే

## రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించండి.

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

**గార్లదిన్నె మేజర్ న్యూస్ :** విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీచేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం గార్లదిన్నెలో మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ లో నిర్వహించనున్న కంటి అద్దాల పంపిణీ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 14వ తేదీన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీచేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అనంతపురం జిల్లాలోని గార్లదిన్నె మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖమాత్యులు సత్యకుమార్ యాదవ్

మిగతా 2లో

---



హిందూపురం అభివృద్ధికి

## ప్రణాళికలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

**పుట్టపర్తి మేజర్ న్యూస్:** హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో హిందూపురం నియోజకవర్గ విజన్ ప్రణాళిక అమలు, పిజిఆర్ఎస్, హౌసింగ్ లేఅవుట్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, వివిధ పాఠశాలల విలీనంతో పాటు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ దార్శనిక ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే సలహాలు తీసుకొని రాబోయే ఐదు సంవత్సరాలలో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలతో సమన్వయం చేసుకుని నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. స్వర్ణాంధ్రఏ2047 ఇప్పటికే జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించిన డేటాను

మిగతా 3లో

---

నదులు, వాగులు, వంకలు కావేవి అనర్హం అన్న చందంగా రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుకమాఫియా పెట్రేగి పోతోంది. గుమ్మగట్ట, రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వున్న వేదవతి హగరి, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో వున్న చిన్నహగరి తో పాటు వాగులు, వంకల్లోని ఇసుకను ఇసుకాసురులు తోడేస్తున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను తమకనుకూలమైన స్థలాల్లో డంపింగ్ చేసి, రాత్రికి రాత్రి సరిహద్దు దాటించి చీకటి వ్యాపారంతో అక్రమార్జన చేస్తున్నారు.

# ఉచితం ముసుగులో పెట్రేగుతున్న ఇసుక మాఫియా



అభివృద్ధి పనుల బూచితో మాయ

పగలు డంపింగ్ ... రాత్రికి రాత్రి జంపింగేనయా..



**రాయదుర్గం, మేజర్ న్యూస్**

ఈ ఇసుకను కర్నాటకలో అధిక ధరలకు విక్రయిస్తూ భారీగా సొమ్ముచేసుకుంటున్నారు. మామూళ్లకు అలవాటు పడిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఇసుక సరిహద్దులు దాటించడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. ఇసుకదందాతో రెచ్చిపోతున్న ఇసుకమాఫియా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను సైతం శాసించే స్థాయికి చేరుకున్నారు. అంటే ఇసుక మాఫియా లక్షలకు లక్షలు ఆర్జించి అధికారులనే తమగుప్పెట్లో పెట్టుకునే స్థాయికి ఎదిగారంటే దందా నిర్వహణ ఏస్థాయిలో జరుగు తుందో అవగతం అవుతుంది. ఇలా ప్రతి మండ లంలో కొంతమంది టీడీపీ ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు యధేచ్చగా ఇసుక మాఫియాగా అవతారమెత్తి , ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు తెలియకుండా దందా చేయడం తో పాటు ఆయనకు చెడ్డపేరు తెస్తున్నారు. అందులో భాగంగానే డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన హెూటల్

మిగతా 2లో

## ఎస్పీ మేడం హిందూపురం వైపు చూడండి..

▸▸ మొదటి పేజీ తరువాయి

మరికొందరైతే ఏకంగా ఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారితో కుమ్మక్కై హిందూపురం నియోజకవర్గం లో పెద్ద ఎత్తున పేకాట స్థావరాల నుంచి మామూల్లు దండుకుంటున్నట్టు సమాచారం. ఏది ఏమైనప్పటికీ ఇటీవల కాలంలో హిందూపురం నియోజకవర్గంలో పోలీసుల పనితీరు ఏ మాత్రం మార్క్ కనబడటం లేదని కొంతమంది అదే శాఖలో పనిచేస్తున్న ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పర్యటనకు వచ్చినప్పుడు ఎస్కార్ట్ బందోబస్తు పేరుతో హడావిడి చేసే పోలీసులు ఎమ్మెల్యే పర్యటన ముగించుకొని వెళ్ళాక ఏ మాత్రం ప్రజా సమస్యలపై ఇక్కడ పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ పెద్ద ఎత్తున ప్రజలు ఆరోపిస్తున్నారు. పేకాట నిర్వాహకుల నుంచి మామూల్లు తీసుకుంటున్న ఒక సీఐపై పోలీస్ శాఖ పై అధికారి పూర్తిస్థాయి నిగా ఉంచి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. ఏది ఏమైనాప్పటికీ బాలయ్య నియోజకవర్గంలో పోలీసుల కనుసైగుల్లో పేకాట, మట్కా కేంద్రాలు నిర్వహిస్తున్న వారి పట్ల ఏ విధంగా నడుచుకుంటారో%ఔ%లేక చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. నేటి దినపత్రిక సూర్య మరొక కథనంలో పేకాట, మట్కా కేంద్రాలతో పాటు సహకరిస్తున్న వారి పూర్తి సమాచారంతో వెల్లడిస్తాం.

## తట్రకల్ శ్రీ సిద్ధ లింగేశ్వర స్వామి దేవాలయంలో పవిత్ర మాఘ పౌర్ణమి పూజలు

### గోమాత విశిష్టతను వెల్లడించిన అర్చకులు



ఉరవకొండ, మేజర్ న్యూస్ : అనాదిగా గడచిన అన్ని యుగాల్లో హిందువులు గోమాతను శ్రీ మహాలక్ష్మికి ప్రతిరూపంగా భావించి పూజించడం ఆనవాతిగా వస్తోందని, గోవు దైవ సమానమని, గోవు పాలు, గోవు నెయ్యి, గోవు పేడ, గోవు మూత్రం సైతం రుత్వికులు, పండితులు పవిత్రంగా భావిస్తారని అర్చకులు శంకర్ స్వామి తెలిపారు. నియోజకవర్గంలోని వజ్రకరూర్ మండలం తట్రకల్ ఎన్ఎన్పి తండా శ్రీ సిద్ధ లింగేశ్వర స్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమి పురస్కరించుకొని అర్చకులు శంకర స్వామి ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామికి శాస్త్రృత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వేకువ జామునే స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, ఆకు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పరమ పవిత్రంగా భావించే గోమాతలకు గోపూజలు ఆచరించారు. మహిళలు గోవులను ప్రత్యేకంగా అలంకరించి, ఫలపుష్పాదులతో ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి మాఘ పౌర్ణమి సందర్భంగా పూజ కార్యక్రమానికి హాజరైన సమస్త భక్తులకు ఆలయ కార్య నిర్వాహకులు అన్నదాన వితరణ నిర్వహించారు. తదనంతరం ఆలయ అభివృద్ధికి ఎన్ఎన్పి తాండ గ్రామస్తులు సీనా నాయక్ రూ.30వేలు తన వంతు విరాళంగా ఆలయ అర్చకులు శంకర స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ నెట్టికంటుని ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ డిజైన్స్‌పై సమీక్షా సమావేశం



గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ : గుంతకల్లు మండలం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ఆసీస్ ఇన్ఫరా కాన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ చీఫ్ డిజైన్ ఇంజనీర్ అల్లంకొండ రామాంజనేయులు వారి బృందంచే రూపాకల్పన చేసిన మాస్టర్ ప్లాన్ డిజైన్స్ ను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నియోజకవర్గం ప్రజలతో, దాతలతో గంగా నిలయం షెడ్ యందు సమీక్ష సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేసి భవిష్యత్తులో శ్రీ స్వామి వారి దర్శనార్థమై విచ్చేయు భక్తులకు సకల సౌకర్య వసతి ఏర్పాట్లు చేయు విషయమై సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగింది. సదరు సమావేశం నందు శాసనసభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో భక్తులకు వసతులు ఏర్పాటు చేయు విషయంలో ఆగమ శాస్త్రపకారము, వాస్తు ప్రకారము ఎటువంటి లోపములు లేకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించ వలయునని రామాంజనేయులుకి సూచించుట జరిగినది. అదేవిధంగా మాస్టర్ ప్లాన్ ప్రకారము కసాపురం గ్రామస్తులను కూడా సహకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సతీష్, ఆలయ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## షబ్ ఏ బరాత్ వేడుకలకు సర్వం సిద్ధం

### రూ.60 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణంకు త్వరలో శ్రీకారం

### నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : అనంతపురం నగరంలోని ముస్లిమ్స్ స్మశాన వాటికల్లో పారిశుద్ధ పనులను అనంతపురం నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం బుధవారం ఉదయం పరిశీలించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా శబ్ ఏ బరాత్ వేడుకల నేపథ్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు స్మశాన వాటికకు వస్తారని ఉద్దేశంతో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులను చేపట్టినట్లు ఆయన తెలియజేశారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రంలోపు అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. నగరంలోని డ్రైవర్స్ కాలనీ స్మశాన వాటికలో 60 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు. అదేవిధంగా 15 లక్షల వ్యయంతో అశోక్ నగర్ తో పాటు హెచ్ ఎల్ సి కాలనీలోని ముస్లిమ్స్ స్మశాన వాటికల్లో ప్రత్యేకంగా లైటింగ్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. 42 లక్షల వ్యయంతో హిందూ స్మశాన వాటికలో పనులను చేపట్టడానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ముస్లిం స్మశాన వాటిక తో సమానంగా హిందూ స్మశాన వాటికల్లో అభివృద్ధి పనులను చేస్తున్నామని తెలిపారు. హిందూ స్మశాన వాటికలో 42 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు సంబంధించి ఈ నెల 14వ తేదీన టెండర్ ప్రక్రియ ఉందని టెండర్ ప్రక్రియ పూర్తవగానే పనులను వేగవంతంగా పూర్తి చేసి అభివృద్ధి పనులను చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, రహంతుల్లా, మదని ఇసాక్, కో ఆప్షన్ సభ్యులు శంషుద్దీన్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, సచివాలయ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది, వైయస్ఆర్సీపీ నేతలు దాదా ఖలేందర్, దాదు, రవీంద్రారెడ్డి, మహబూబ్ బాషా, జీలాన్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితం ముసుగులో పెట్రేగుతున్న ఇసుక మాఫియా

▸▸ మొదటి పేజీ తరువాయి

నాగరాజు కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేసి రైల్వే స్టేషన్ ఖాళీస్థలంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రజలను మాయ చేసే విధంగా కంకర కూడా వేసి, కంకర పక్కనే ఇసుక డంపింగ్ చేయడం, రాత్రికి రాత్రి ఇసుకను మాత్రం తరలించి సొమ్ముచేసుకుంటున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కంకర మాత్రం చెక్కుచెదరదని, ఇసుక మాత్రం రెండు మూడు రోజులకోమారు ఖాళీ, కావడం తిరిగి డంపింగ్ కావడం గ్రామస్థులందరూ గమనించారని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు కర్నాటకకు ఇసుక జంపింగ్ అయినట్లు విమర్శిస్తున్నారు. అలాగే ఓబుళాపురం గ్రామం ఇందిరమ్మ కాలనీలో చర్చి పనులు చేస్తున్నట్లు నమ్మించే విధంగా ఇసుక డంపింగ్ చేసి, రాత్రికి రాత్రి డీవీఆర్ బసవరాజు, ట్రాక్టర్ రామి తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నెల రోజుల నుండి ఇసుక డంపింగ్ చేయడం, రాత్రికి రాత్రి కర్నాటకకు తరలించడం చేస్తున్నారని వెల్లడిస్తున్నారు. ఈ రెండు చోట్ల ఒక్క సెంటీమీటర్ అభివృద్ధి పనులు చేపట్టలేదని, వంకరబుద్ది ప్రదర్శిస్తూ, అభివృద్ధి బూచీగా చూపి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుకమాఫియా దందాను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీచేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించండి.

▸▸ మొదటి పేజీ తరువాయి

పాల్గొంటారన్నారు ఈ కార్యక్రమానికి సంబంధించి నోడల్ అధికారిగా అసిస్టెంట్ కలెక్టర్ వ్యవహరిస్తారూ. స్టేజి ఏర్పాటుకు సంబంధించి ఆర్ అండ్ బి ఎస్ ఈ తో కలిసి సమన్వయం చేసుకోవాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. ఈ కార్యక్రమం ప్రోటోకాల్ సంబంధించి గార్లదిన్నె తహసిల్దార్ ,నీటి వసతి,పారిశుద్ధ్య ఏర్పాట్లను స్థానిక ఎంపీడీవో లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పనులపై అశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ నాయక్ ను పంపిస్తున్నట్లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ తెలిపారన్నారు. వారితో సమన్వయం చేసుకొని మినిట్ టు మినిట్ ప్రోగ్రాంను తయారు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే కార్యక్రమం నిర్వహణ ప్రాంతంలో స్క్రీనింగ్ స్టాల్ ను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా డాక్టర్ సైదన్నను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమయం తక్కువగా ఉన్న యుద్ధ ప్రాతిపదికన పనులను వెంటనే చక్కగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఈ బి దేవి,డిఈఓ ప్రసాద్‌బాబు, తహసిల్దార్ ఈరమ్మ, ఎంపీడీవో యోగానంద రెడ్డి, ఎంఈఓ తారక చంద్రనాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయ రాజగోపురాలకు కొండంత దాతృత్వం

### ముందుకొచ్చిన బళ్లారి వాసి అంతా తానై పనులు కొనసాగింపు

### శరవేగంగా పనులు పూర్తి చేయాలని ఆరాటం













కూడేరు, మేజర్ న్యూస్ : కూడేరు మండలంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ జోడు లింగాల పుణ్యక్షేత్రంలో శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర - దక్షిణ రాజగోపురాల నిర్మాణమునకు బళ్లారి బసవన్న గౌడ్ కొండంత దాతృత్వం చాటుకుంటున్న విషయం ఆలస్యంగా తెలిసింది. అక్షరాల కోటి రూపాయలు వీక్షించి రాజగోపురాల నిర్మాణం సర్వేగంగా పూర్తి చేసేందుకు ఆరాటపడుతున్నాడు 75 ఏళ్ల పెద్దాయన బసవన్న గౌడ్ 182 అడుగుల భూమాత గర్భం నుండి ఒకే పానిపట్టంపై వెలసిన శివపార్వతుల పుణ్యక్షేత్రంలో రాజగోపురాలు నిర్మాణం చేపట్టడం తన పూర్వజన్మ అదృష్టంగా భావిస్తున్నానని బళ్లారి పట్టణం విద్యానగర్ రెండవ క్రాస్ నందు నివాసం ఉంటున్న బసవన్న గౌడ్ మంగళవారం మేజర్ న్యూ స్ కూ ఆనందంగా తెలియజేశారు, తన సొంత గ్రామమైన బళ్లారిలో ఆరెకరాల పొలమును విక్రయించి ఆ డబ్బులతో రాజ గోపురాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలియజేశారు. వీటి నిర్మాణం కోసం ఎవరి దగ్గర చేయి చాచకుండా డబ్బులతోనే నిర్మాణం చేపట్టానని ఆనందం వ్యక్తం చేశారు. నమ్మి కొలిచే భక్తుల కొంగుబంగారంగా విరాజుల్లుతున్న శ్రీ సంఘ మేశ్వర స్వామి దేవస్థానంలో ఇప్పటికే తూర్పు - పడమర రాజగోపురాలు నిర్మించబడ్డాయ్ని ఉత్తర దక్షిణ రాజగోపురాలు ఉంటే దేవస్థానం మరింత గా ఆ పంచభూతాదారుడు భక్తులపైన కురిపిస్తాడని దాత బసవన్న గౌడ్ నమ్మి రాజగోపురం నిర్మాణంలో శిల్పకళాకారులైన ఉరవకొండ ప్రాంత గ్రామానికి చెందిన క్రిష్టప్ప మరో శిల్ప కళాకారుడు అభినయ్ శిల్పాలను తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది త్వరలో అర్ధనారీశ్వరుడు జరుపుకునే బ్రహ్మోత్సవాలకు ముందే ఉత్తర దక్షిణ రాజగోపురాలు నిర్మాణం పూర్తి చేయాలని సంకల్పంతో ఉన్నప్పటికీ కొన్ని అని వార్య కార్యక్రమాలలో భాగంగా కొంత రాజు గోపురాలు నిర్మాణంలో ఆలస్యంగా జరిగిన దక్షణ దిశ రాజగోపురం పనులు ముగింపుకు చేరుకున్నట్లు కూడేరు గ్రామ పెద్దలు కుమ్మర ఓబులప్ప కుక్క పల్లి వెంకటయ్య, కుమ్మరి వెంకటరాముడు తెలియజేశారు. ఉత్తర దిశ రాజగోపాత్రము పనులను కూడా త్వరలోనే స్థపతి సలహాలు సూచనల మేరకు ప్రారంభిస్తామని దాత బసవన్న గౌడ్ వివరించారు. ఇదిలా ఉండగా తూర్పు పడమర ఉత్తర దక్షణం రాజగోపురాల నిర్మాణంతో పాటు దేవస్థానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు శ్రీ జోలింగాల సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టుటకు దాతలు ముందుకు రావాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు. 16వ శతాబ్ది కాలంలో నిర్మించిన ఈ దేవస్థానం అనంతపురం జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండటం గమనర్వం, దేవస్థానంలో పర్వదిన పూజాధి కాలంలో పాల్గొనేందుకు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండి కాకుండా స్వామి వారిని దర్శించుకుని సేవించుటకు ఇక్కడికి తరలివస్తున్నారు. పూర్వీకుల కాలం నుండి శ్రీ సంగమేశ్వర స్వామి సేవలో తమ పూర్వీకుల కాలం నుండి సేవకులుగా ఆలయ పూజారులుగా కొన సాగుతున్నట్లు రాజగోపురాలు గోపురాల నిర్మాణ దాత బసవన్న గౌడ్ తెలియజేస్తూ దేవస్థానం వద్ద. మహిళలకు స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణమునకు దాతలు ముందుకు రావాలని గ్రామ పెద్దలను తెలిపారు.

# సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి.

## జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



**గుత్తి, మేజర్ న్యూస్ :** సేవాఘడ్‌లో ఈ నెల 13, 14, 15వ తేదీలలో నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ అయా అధికారులను ఆదేశించారు. సెవాలాల్ జయంతోత్సవాల్లో భాగంగా మండలంలోని సేవాఘడ్ లో బుధవారం ట్రస్టు సభ్యులు. అన్ని శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15న సేవాఘడ్ లో నిర్వహించే సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలలో మౌళిక సదుపాయాలు ఎర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు అయా ప్రాంతాల నుండి భారీగా విచ్చేస్తున్న తరుణంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా జయంతి ఉత్సవాలను అధికారులు సమన్వయంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సేవాఘడ్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లును చేయాలన్నారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచడానికి సేవాఘడ్ వద్ద బృందాలను నియమించాలన్నారు. సేవాఘడ్ వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరుగా ఏర్పాటు చేయాలని, జనరేటర్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. సేవాఘడ్ వద్ద వచ్చే భక్తులకు త్రాగునీరు, తాత్కాలిక కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లను, ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో గుంతకల్లు, గుత్తి మున్సిపల్ కమిషనర్లుతో, పంచాయతీ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పాకెట్లు, 104 మరియు 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులకు సూచించారు. శిశు సంక్షేమ శాఖఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే పాలు అవసరమైన పిల్లలకు అందించే విధంగా చూడాలని, భోజనం చేసే ప్రాంతాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, అలాగే తాగునీటి ట్యాంకులను ఉంచాలని, సేవాఘడ్‌కు వచ్చే భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్ట్ సభ్యులు మరియు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేయుటకు అధికారులు, ట్రస్టుసభ్యులు సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు, డిఎల్ డిఓ విజయలక్ష్మి, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సంత్ సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు కేశవనాయక్, అశ్వర్థ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనారాయణ స్వామి అమ్మవారి నిత్యసేవకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ.5,01,116లు విరాళం



**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవాలు పురస్కరించుకొని స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరిగి సంవత్సరం కాలం అయినందు వలన 5రోజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహా సుదర్శన హోమం లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం గ్రామ రథోత్సవం అంగరంగ వైభవంగా కనుల పండుగగా జరిగినది. అనంతరం గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు సేవకు ఆలయ అభివృద్ధి కొరకు రూ.5,01,116లు ఇవ్వడం జరిగినది. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉపాలయాల సందర్శించి పూర్ణకుంభంతో సన్నాయిమేళ తాళాలతో ఎమ్మెల్యే జయరామ్‌కు ఆలయ ట్రస్ట్ ద్వారా తరుపున స్వాగతం పలుకుతూ సుదర్శన మహా సుదర్శన హోమంలో పూర్ణహుతి అనంతరం ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త అయిన తలారి పరుశురాముడు శకుంతలమ్మ గారి దంపతులకు రూ.5,01,116లు ఎమ్మెల్యే జయరాం కుటుంబ సభ్యులతో కలిసి అందజేయడం జరిగినది. ఇంత పెద్ద ఎత్తున రాతి దేవస్థానం నిర్మించి మహా క్షేత్రాన్ని నెలకొల్పినందుకు ఆలయ వ్యవస్థాపకులకు ధర్మకర్తలైన దంపతులకు సన్మానం చేయడం జరిగినది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత పవిత్రమైన దేవస్థానం నిర్మించి ఎంతో మందికి ఆధ్యాత్మిక దైవ జ్ఞానాన్ని పెంపొందిస్తున్నందుకు దేవస్థానములో స్వామి అమ్మవారిని చూస్తూ ఉంటేచూస్తుంటే ఎంతో తేజస్వంతంగా ఎంతో మనసుకి తెలియని ఆనందాన్నిస్తుందని ఈ దేవస్థానం తిరుపతిలో వెంకటేశ్వర స్వామి చూసినట్లుగా ఉందని అంతటి క్షేత్రం ఉంటుందని అన్నారు. అనంతరం పరశు రాముడు మాట్లాడుతూ చాలా సంతోషం జయరామ్ ఆలయ అభివృద్ధిలో భాగస్వామి అయినందుకు ఎమ్మెల్యే అన్నా వదినలను స్వామి అమ్మవారి పట్టు వస్త్రాలతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగినది. కుటుంబ సభ్యులకు అందరికీ లక్ష్మీనారాయణ స్వామి కృపా కటాక్షాలు ఉంటాయని ఉండాలని మనసారా దేవుని కోరుకుంటున్నాము. అలాగే పట్టణ ప్రముఖులు పెట్రోల్ బంక్ అధినేత దేవేంద్రప్ప దేవి దంపతులు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయంగా రూ.5.01.116లు ఇవ్వడం స్వామి అమ్మవార్ల వస్త్రాలతో సన్మానం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు ఇవ్వడం చేయడం జరిగినది. వీరికి వీరి కుటుంబానికి లక్ష్మీనారాయణ దివ్య ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. పట్టణ ప్రముఖ డాక్టర్ శివాని లక్ష్మీనారాయణ దంపతులు నిత్య అన్నదాన సేవకు ఒక లక్ష 16 రూపాయలు ఇవ్వడం వీరికి స్వామి అమ్మవారి జరిగింది దంపతులకు సన్మానం చేసి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగినది. కుటుంబానికి ఆ దేవదేవుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం. మల్లికార్జున సైకిల్ స్టోర్ రామకృష్ణ లక్ష్మీదేవి దంపతులు ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం ఇవ్వడం జరిగినది ఇనుగూరు శంకర్ నారాయణ దంపతులు ఇటుకల బట్టి లక్ష్మన్న దంపతులు జితేంద్ర మేదర సంఘం డాక్టర్ రమణా దాదాపుగా 30 మంది పైగా ముందుకు రావడం జరిగినది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవారి ఆశీస్సులు పొందినందుకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు, కార్యకర్తలు, బిజెపి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయం ట్రస్ట్ కమిటీ సభ్యులు అధ్యక్ష కార్యదర్శులు, స్వామి అమ్మవారి భక్తాదులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## స్వమిత్వ సర్వీస్ స్టేటస్ త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు



**అనంతపురం, మేజర్ న్యూస్ ప్రతినిధి :** జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజ నాయుడు ఆత్మకూరు మండలం లోని తోపుదుర్తి,సనప గ్రామ – వార్డు సచివాలయాలను తనిఖీ చేశా రు. స్వమిత్వ సర్వే స్టేటస్ పరిశీలించి వీలైనం త తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం లో భాగంగా జరిగే సర్వేల స్టేటస్ గురించి, బయో మెట్రిక్ హాజరు గురించి తనిఖీ చేశారు. అలాగే సనప గ్రామ పంచాయతీ లోని ఎస్ డబ్ల్యు పి సి షెడ్ ను సందర్శించారు. వర్మి కంపోస్టు తయారీ కి ఏర్పాటు చేశారు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తీసుకొని రావడం, ప్రతి గురువారం ఆ ఎరువును విక్రయించడం,క్లాప్ మిత్ర వేతనాలు గురించిన అంశాలపై ఈవోఆర్‌డి, పంచాయతీ సెక్రటరీలకి పలు సూచనలు చేశారు.

## హిందూపురం అభివృద్ధికి

# ప్రణాళికలు చేపట్టాలి

▸▸ మొదటి పేజీ తరువాయి

బుక్ చేసి, నియోజకవర్గ విజన్ ప్రణాళికను రూపొందించడానికి పుస్తకం ఆధారంగా డేటాను సిద్ధం చేయాలన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్2047 పది సూత్రాలు కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. వ్యవసాయం అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవారంగం, పర్యాటక రంగం తదితర రంగాలపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడం,వృద్ధి రేటులో 15% సాధించ డానికి ప్రణాళిక అమలు చేయాలని పేర్కొన్నారు.గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో టిడ్కో గృహాల కోసం ప్రభుత్వ భూమి లభ్యతను గుర్తించాలని, అధికారులు ప్రభుత్వ భూమి ఎంత ఉన్నదో నివేదికలు శనివారం లోపు అందజేయాలని ఆదేశించారు.గృహ నిర్మాణం, లబ్ధిదారుల గుర్తింపు మరియు నివాస స్థలాలకు ఎంత మంది లబ్ధిదారులు అవసరమో ధృవీకరించడానికి, స్థలాల కోసం వివరణాత్మక డేటాను పట్టిక రూపంలో సమర్పించాలి అని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, డిఆర్డిఎ పిడి నరసయ్య, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డీఈవో కిష్టప్ప, హౌసింగ్ ఫీడ్ వెంకటనారాయణ, ఎంపీడీవోలు నరసింహ మూర్తి, శివకుమార్, రమణమూర్తి, ఎంఈఓ నాగరాజు, లేపాక్షి ఎమ్మార్వో సౌజన్య లక్ష్మి, హిందూపురం ఎమ్మార్వో, చిలమత్తూరు ఎమ్మార్వో, టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధారాణి లు పాల్గొన్నారు.

## మాడెనహళ్లి మారెమ్మ జాతరకు రాయదుర్గం వైసీపీ నియోజవర్గ సమన్వయకర్త మెట్టు విరాళం అందజేత



**డి. హీరేహాళ్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మడేనహళ్లి గ్రామంలో జరగబోయే మారెమ్మ జాతరకు తన వంతు సహకారంగా రాయదుర్గం నియోజవర్గ వైసీపీ సమరయకర్త మెట్టు గోవిందరెడ్డి రూ. 25000 అందించినట్లు మండల వైసీపీ కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, బీసీ సెల్ తాలూకు అధ్యక్షుడు తొండ వెంకటేశు లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు బొమ్మన్న చింతపండు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** మండలంలోని స్థానిక శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వరాలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలోపాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## పిఎఫ్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన సివిల్ సప్లై డిప్యూటీ తహాశీల్దారు



**కూడేరు, మేజర్ న్యూస్ :** కూడేరు మండలంలోని బుధవారం రోజున సివిల్ సప్లై డిప్యూటీ తహాశీల్దార్ లక్ష్మీ దేవి మండలంలోని రేషన్ షాపులను (కోడ్ 1214010) ఉదిరిపికొండ-షాప్ నంబర్ 10, జల్లిపల్లి షాప్ నంబర్ 12, కొర్రకోడులోని 16, 27 రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపుల్లోని స్టాక్ నిలువల పరిమాణాన్ని పరిశీలించారు. అదేవిధంగా రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు బియ్యం, రాగులు, చక్కెర లాంటి సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారని వాటి పై ఆరా తీశారు. అదేవిధంగా రేషన్ షాపుల లోని బియ్యం ఎంత నిల్వ ఉన్నది. స్టాక్ రిజిస్టర్ల వివరాలను రేషన్ డీలర్లను అడిగి తెలుసుకున్నారు. రేషన్ డీలర్ షాపు వద్ద నోటీసు బోర్డులను తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహాశీల్దారు లక్ష్మీదేవి, వీఆర్వో లక్ష్మన్న, డీలర్లు ఉన్నారు.

## నైపుణ్యంతో ప్రపంచాన్ని జయించవచ్చు..

### మహీంద్రా జనరల్ మేనేజర్ రామకృష్ణ



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అత్యుత్తమ నైపుణ్యంతో ప్రపంచాన్ని జయించవచ్చని మహీంద్రా జనరల్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. బుధవారం అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటిఐ లో నూతనంగా ఏర్పాటు చేసిన మహీంద్రా టెక్ కార్నర్ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలు ఎన్నో జరుగుతున్నాయని వాటిని విద్యార్థిదశ నుంచే నేర్చుకోవడం అలవర్చుకోవాలన్నారు. హెచ్ఆర్ మేనేజర్ నరేంద్రబాబు మాట్లాడుతూ.. నేడు ఐటిఐ చదువులకు ఎన్నో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఐటిఐ ప్రిన్సిపల్ రామమూర్తి మాట్లాడుతూ... మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ వారు డీజిల్ మెకానిక్ మోటార్ మెకానిక్ విద్యార్థులు అదనాతన ఎంత సామాగ్రిని రూ. 47 వేల వ్యయంతో ఐటిఐ కి అందించినదుకు కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపి వారిని సత్కరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ తులసి రాముడు, శ్రీనివాసులు అధ్యాపకులు జయరాం కృష్ణ ప్రసాద్, ఇజాక్ భాష విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు ఆనంద్‌రాజును కలిసిన నూతన బలిజ సంఘం సభ్యులు



**కనేకల్లు, మేజర్ న్యూస్ :** నూతనంగా ఎన్నికైన కనేకల్ మండలం శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యు ఆనంద్ రాజును శాలువా కప్పి ఆయన్ని పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు రాపా ప్రకాష్, సద్దుల తిప్పేస్వామి, అధ్యక్షులుగా ముక్కం మురళి, ఉపాధ్యక్షులు నాగిరెడ్డిపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి దత్త రాజేష్, కోశాధికారి గుడి గుండ్ల గంగాధర, సంయుక్త కార్యదర్శి కుమార్ వీరితోపాటు మాజీ కోశాధికారి సద్దుల గోవిందరాజులు, సలహాదారులు దత్త వెంకటేశ్వర్లు, గాజులపల్లి జయరామ్, విజయ్ కుమార్, దత్త తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీ రంగనాథ స్వామి శ్రీదేవి, భూదేవి కళ్యాణం

### భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగాణం



**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో శ్రీరంగాపురం గ్రామంలో వెలిసిన శ్రీ రంగనాథ స్వామి ఉత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. బుధవారం తెల్లవారు జామున శ్రీ రంగనాథ స్వామి శ్రీదేవి, భూదేవి కళ్యాణ మహోత్సవం వేద పండితుల చేత కన్నుల పండుగ నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణం తిలకించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. శ్రీ రంగ నాథ స్వామి శ్రీదేవి భూదేవి ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహా లను రథంలో ఉంచి పురువీధుల గుండా ఊరేగించారు. రాత్రికి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు తెలిపారు. పూజా కార్యక్రమాలు కళ్యాణం పురోహితులు శంకరప్ప స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రికి బాలనాగమ్మ ఉచితనాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.

## శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపం అధ్యక్షుడిగా కటికం మల్లేష్



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణమండపం నూతన అధ్యక్షులుగా పట్టణానికి చెందిన కటికం మల్లేష్ ఎంపికయ్యారు. పట్టణ శివారు బళ్ళారి అనంతపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి కళ్యాణ మండపంలో బుధవారం దేవాంగ కుల పెద్దల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి కళ్యాణ మండపం నూతన కార్యవర్గం ఏర్పాటుపై దేవాంగ కుల పెద్దలు చిట్టా శ్రీధర్, కొమ్మ సాని బాలచంద్ర, మిడతల విశ్వనాథ్, నున్నా రంగనాయకులు తమ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యులతో కళ్యాణ మండపం పాలకవర్గం ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. సమీక్ష సమావేశానికి హాజరైన దేవాంగ కులస్తుల సలహాలు, సూచనలను అనుసరించి కళ్యాణ మండపం నూతన అధ్యక్షులుగా కటికం మల్లేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్తిస్థాయి పాలకవర్గాన్ని మరో మూడు రోజుల్లో ప్రకటిస్తామని కుల పెద్దలు తెలిపారు. శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి కళ్యాణ మండపం నూతన అధ్యక్షునితో పాటు మిగిలిన పాలకవర్గం సభ్యులు పట్టణములోని శ్రీశ్రీశ్రీ పెద్ద చౌడేశ్వరి దేవాలయం నందు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ ప్రతినిధులు నిమ్మల ప్రసాద్, రెడ్డి నాగరాజు, డోనపర్తి ప్రతాప్, కొత్త మురళీకృష్ణ, చందన చలపతి, చిట్టా రఘు, ఆర్ సి ప్రసాద్, ఉట్టి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## భరతమునికి నృత్యంజలి..

### చిన్నారులకు జ్ఞాపికలు ప్రశంస పత్రాలు అందజేసిన సంస్కార భారతి..




**అనంతపురం విద్య మేజర్ న్యూస్:** భరతముని జయంతి సందర్భంగా శ్రీ నృత్య కళా నిలయం ప్రాంగణంలో భరత ముని జయంతిని కళాకారులు తమ నృత్య ప్రదర్శన ద్వారా నాట్య శాస్త్ర రచయిత అయిన భరతమునీకి నృత్యంజలి సమర్పించారు .కుమారి దివ్యశ్రీ ఆధ్వర్యంలో పలువురు నృత్య కళాకారులు ఈ కార్యక్రమాన్ని జరిపించారు .భరతమునికి అంజలి ఘటించారు .నాట్య వేదం రచించిన భరతముని గురించి సంస్కార భారతి లక్ష్మీ, ఎస్కేయూ రిటైర్డ్ రిజిస్టర్ సుధాకర్ బాబు, శ్రీనిధి రఘు, సంధ్యా మూర్తి చక్కగా వివరించారు. చిన్నారులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను సంస్కార భారతి వారు అందించారు.

## వైభవంగా విప్రమలై శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మారథోత్సవం

### భారీగా తరలివచ్చిన భక్తజనం

### గోవిందనామస్మరణతో మార్మోగిన విప్రమలై కొండకోనలు





**రాయదుర్గం, మేజర్ న్యూస్ :** రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామ పంచాయితీ పరిధిలో విప్రమలై కొండల్లో వెలిసిన శ్రీ లక్ష్మీనవనరసింహస్వామి 29వ బ్రహ్మారథోత్సవం బుధవారం అంగరంగవైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి, వేదపండితులు హరిప్రసాద్‌లు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యకైంకర్యములు గావించి, పుష్పాలంకరణతో నైవేద్య పూజలు, రథాంగహోమం నిర్వహించారు. ఉదయం 9.15 గంటలకు విశేష పూజలు నిర్వహించిన తరువాత మడుగుతేరు లాగారు. అనంతరం 11 గంటల నుండి మధ్యాహ్నాం 2. గంటల వరకు వేదపండితుల మంత్రోచ్చారణతో, భక్తజనుల గోవిందనా మస్మరణ ధ్వనులతో, మేళతాళాల మధ్య బ్రహ్మారథోత్సవం కనులపండువగా నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, పాటిల్ సదాశివారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, బళ్లారి ఆనందప్ప కుమారులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయకమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ, అధ్యక్ష, కార్యదర్శులు బీఎన్ టీ తిప్పేస్వామి, ధర్మన్నలతో కలిసి రథాన్ని లాగి బ్రహ్మారథోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీలక్ష్మీనవనరసింహ స్వామి బ్రహ్మారథోత్సవానికి రాయదుర్గం పరిసరప్రాంతాల నుండే కాకుండా కర్నాటక నుండి కూడా భక్తులు ఆశేషంగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవానికి హాజరైన భక్తుల కు ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు అన్నదానం నిర్వహించింది. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో రాయదుర్గం, డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ ఎస్ఐలు బాలరాజు, గురుప్రసాద్ రెడ్డి, నాగమధు, నబిరసూల్ తో కలిసి గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, కోశాధికారి నరసింహులు, సహాయ కోశాధికారి సత్యనారాయణ, అకౌంటెంట్ వెంకటేశులు, ప్రచార కార్యదర్శి కమలాక్షుడు, గురురాఘవేంద్ర ప్రసాద్ సభ్యులు గురునాథ్ రెడ్డి. రామిరెడ్డి, వెంకటరెడ్డి, తిమ్మారెడ్డి, నరసింహులతో పాటు పురప్రముఖులు, మాలాదీక్షపరులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.







## కనుల పండువగా రంగనాథుని రథోత్సవం

### ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

### స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించిన గుమ్మనూరు నారాయణ

**గుత్తి, మేజర్ న్యూస్ :** మండలంలో తోండపాడు గ్రామంలో రంగనాధుని రథోత్సవం కనుల పండుగగా కొనసాగింది. రంగనాధ స్వామి బ్రహ్మత్సవాల్లో బాగంగా బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రంగనాదుని ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. తొలుత అలయ అర్చకులు రవికుమార్, లిఖిల్ వర్మ, చేతన్ వర్మ, నవీన్ కుమార్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దేవాదాయ శాఖ అధికారులు అద్యక్షతనలో గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, ఈఓ రామాంజనేయులు, తహశీల్దార్ డి.ఓబులేసు. మాణిక్య రంగనాథ స్వామి అభివృద్ధి కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, టెంకాయిల కొట్టి రధాన్ని లాగి ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భారీగా భక్తులు ఎగబడ్డారు. భక్తులు రంగనాధుని నామశ్మరణ చేస్తురథాన్ని లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు బారీ ఎత్తున తరలివచ్చారు. వేకజామున శ్రీదేవి భూదేవి రంగనాధుని కళ్యాణం అర్చకులు వైభవంగా జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ కుటుంబ సమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుణాల సందర్భంగా అలయ పరిసరాల్లో భక్తులతో కిటకిటలాడింది. రైతులు ఎండ్లబండ్లతో అలయ చూట్టు ప్రదక్షిణలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. అంతేకాకుండా గాజుల అంగళ్లు, అట వస్తువుల దుకాణాలు, తినబండారాల అంగళ్లు, ఊయలలు, జాయింట్ వీల్ లు వద్ద భక్తుల సందండితో కిటకిటలాడాంది. ఈ సందర్భంగా బేతాపల్లి వైద్యాధికారులు వైద్యా సిబ్బందితో వైద్యా శిబిరాన్ని ఎర్పాటు చేశారు.

**ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు :** రంగనాధ స్వామి రథోత్సవం సందర్భంగా విచ్చేసిన గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం. తనయుడు గుమ్మనూరు ఈశ్వర్. సోదరులు శ్రీనివాసులు. నారాయణ .అలయ అర్చకులు. దేవదాయ శాఖ ఆధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు అనంతరం అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పోలీసులు బారీ బందోబస్తు :** రంగనాధుని రథోత్సవం సందర్భంగా గుంతకల్లు డియస్పి శ్రీనివాసులు.గుత్తి సిఐ వేంకటేశ్వర్లు. ఏస్ఐ సురేష్ గుంతకల్లు సిఐ ఏస్ఐ ఎ ఏస్ ఐ లు .యాడికి పప్పురు సుమారు 180 మంది కానిస్టేబుల్ తో బందోబస్తు ఎర్పాటు చేశారు.ఈ రథోత్సవం లో యంపిడిఓ ప్రబాకార్. ఈ ఓ ఆర్ డిఅలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామి రెడ్డి యాధవ్.టిడిపి నాయకులు మద్దిలేటి. చిన్నరెడ్డి యాధవ్ .ఆసుపత్రికి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా.రమేష్ ప్రతాప్ కమిటీ మాణిక్య రంగనాథ స్వామి అభివృద్ధి కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ సిబ్బంది రామకృష్ణ బాలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య రానివ్వం..

### - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

### పీఏబీఆర్ జలాశయం, ముద్దలాపురం పంపు హౌస్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్

**కూడేరు, మేజర్ న్యూస్ :** ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యామును అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆకస్మికంగా పీఏబీఆర్ డ్యామును బుధవారం నీటి నిల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేయడం జరిగింది. పీఏబీఆర్ డ్యామ్ నందు ఎంత నీరు ఉందని అధికారులను ఆరా తీశారు. అలాగే ముద్దలాపురం పంపు హౌస్ వద్ద ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో లాగా ప్రజలకు త్రాగునీటి ఎద్దడి పై ఇబ్బందులు పడకుండా ఈ వేసవకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను తెలిపారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. పైప్ లైన్ లీకేజీలు, మోటర్ల పనితీరుగురించి తెలుసుకున్నారు. నగరానికి మరో 60 ఎంఎల్డి వాటర్ ప్లాంట్



అందుబాటులోకి వచ్చింది అని, కొన్ని కాలనీల్లో రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతుందని, ఇకనుంచి ఆ సమస్య కూడా లేకుండా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. పీఏబీఆర్ లో 3.5 టిఎంసిల నీరు నిలువ ఉన్నదని, అనంతపురం నగరానికి ఒక టీఎంసీ నీరు సరిపోతుందని, ఎన్డీఏ కూటిమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం జిల్లా అంటే ప్రత్యేకమైన శ్రద్ధ చొరవ ప్రత్యేకత ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య లేకుండా అనంతపురం నగరమునకు జిల్లాకు కేటాయింపులు చేశారు అని ఆయన అన్నారు. త్వరలో హంద్రీనీవా లైనింగ్ పనులు కూడా పూర్తవుతాయి అని, సాగు, తాగునీటి సమస్య లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటిమి ప్రభుత్వం చూసుకుంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

## వైసీపీలో చేరిన ఎన్ఎస్ యూఐ నగర అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి



అనంతపురం రూరల్ మేజర్ న్యూస్: ఎన్ ఎస్ యూ ఐ అనంతపురం నగర అధ్యక్షుడిగా పనిచేస్తున్న నిశాంత్ రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డి సమక్షంలో మాజీ విద్యాశాఖ మంత్రి డాక్టర్ శైలజనాథ్ , బండ్లపల్లి ప్రతాపరెడ్డి నాయకత్వంలో వైసీపీలో చేరారు. నిశాంత్ రెడ్డి ఎన్ ఎస్ యు ఐ లో సామాన్య కార్యకర్త నుండి అనంతపురం జిల్లా ఎన్ ఎస్ యు ఐ నగర అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యారంగ సమస్యలపైన, విద్యార్థుల పక్షాన స్కాలర్షిప్ కోసం నిరుద్యోగుల గ్రూప్ 1 ,గ్రూప్ 2 ,పోలీసు ఉద్యోగాలపై, డీఎస్సీ అభ్యర్థుల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడానికి ,సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు వసతులు కల్పించాలని గత ఐదు సంవత్సరాలుగా అనంతపురం నగరంలో రాజీలేని పోరాటాలు చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ విధానాలు మెచ్చి,రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పక్షాన వైయస్సార్సీపి బలోపేతానికి, జగన్మోహన్ రెడ్డి సీఎం కావడానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని నిశాంత్ కుమార్ రెడ్డి తెలియజేశారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన శెట్టిపల్లి శశిధర్ రెడ్డి



శింగనమల,మేజర్ న్యూస్ : శింగనమల మండలం సీ.బండమీద పల్లి విద్యార్థి జేఈఈ మెయిన్స్ లో 99.97 పర్సంటేజ్ సాధించి తనఐప్రతిభ చాటాడు.సీ.బండమీదపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి కుమారుడు శశిధర్ రెడ్డి ఇంటర్ ద్వితీయ సంవత్సరం నారాయణ కళాశాల మాదాపురంలో చదువుతున్నారు.నిన్న జేఈఈ మెయిన్స్ లో శశిధర్, 99.97 పర్సంటేజ్ సాధించి ఆల్ ఇండియన్ 250 ర్యాంకు సాధించాడు. శశిధర్ తల్లి,దండ్రులు రమణమ్మ, నరసింహారెడ్డి సాధారణ వ్యవసాయ దారుల కుటుంబం. వీరు వ్యవసాయం చేసుకుంటూ శశిధర్ ని ఉన్నత చదువులు చదివిస్తున్నారు.

## బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా శివతేజ సత్తా



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : తెలంగాణ ఫిట్నెస్ ఫెస్టివల్ లో భాగంగా ఇటీవల హైదరాబాద్ లోని ఎల్ బి స్టేడియం లో వివిధ రాష్ట్రాల వారు పాల్గొన్న షఫీ షమీ క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీ లలో అనంత వాసి చారుగుండ్ల శివ తేజ తృతీయ స్థానం దక్కించు కొని సత్తా చాటారు. అనంత పురం కు చెందిన శివ తేజా షఫీ షమీ క్లాసిక్ లో బాడీ బిల్డింగ్ పోటీ లలో పాల్గొని 75-80 కే జీ ల కేటగిరి లో తృతీయ స్థానం సంపాదించి కొని సత్తా చాటారు. శివ తేజ బాడీ బిల్డింగ్ చాంపియన్ గా ఎన్నిక కావడం పట్ల తల్లి దండ్రులు మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్, టీచర్ అరుణ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , సిబ్బంది, నగర వాసులు హార్షం వ్యక్తం చేశారు. బెంగళూరు లో జరుగు బోవు జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో ప్రథమ స్థానం తో అనంత పురము నకు ఇంకా మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శివ తేజా ఇంతకు మునుపు మిస్టర్ ఆంధ్ర గా 3 వ స్థానం దక్కించుకున్న విషయము విదితమే.

## విలువలు, విశ్వసనీయతకు మారు పేరు వైయస్ జగన్మోహన్ రెడ్డి

### – కలిసి కట్టుగా పని చేద్దాం.. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం: ఆలూరు సాంబశివారెడ్డి




శింగనమల/ గార్లదిన్నె మేజర్ న్యూస్ : ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీలను నెరవేర్చిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని అనంతపురం వైఎస్ఆర్సిపి నేత ఆలూరు సాంబశివరెడ్డి అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల ఇంటి దగ్గరికి వెళ్లి ధైర్యంగా మేము సంక్షేమం పథకం అందించాము అని అడిగిన ప్రభుత్వం వైసీపీ అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తూ రాష్ట్రాన్ని మరో శ్రీలంకను చేస్తారంటూ గతంలో చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేశారన్నారు. అదే ఆయన ఎన్నికల ముందు నెరవేర్చలేని సూపర్ సిక్స్ హామీలు ఇస్తూ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే ఇచ్చిన హామీలు నెరవేరుస్తాడు అని ప్రజలు నమ్మి ఓటు వేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై చేస్తున్న ప్రజల పక్షాన పోరాటాలకు మద్దతుగా మరియు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి వైసీపీ లోకి చేరడం సంతోషం అన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా మంత్రిగా, పిసిసి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన సాకే శైలజనాథ్ వైసీపీలోకి రావడాన్ని స్వాగతిస్తూ.. సంతోషాన్ని వ్యక్తం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి మేమందరం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** నగరంలోని యస్వీ డిగ్రీ,పిజి కళాశాలలో వైస్ చైర్మన్ సి. చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నగర రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని వాటి బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ క్రైమ్ ఆర్థిక పరిస్థితులకు, భద్రతకు హాని కలిగిస్తుందని, సైబర్ నేరాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ముప్పుగా మారుతోందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు అలాగే నేటి సాంకేతిక యుగంలో సమాచార భద్రత చాలా ముఖ్యమని సిఐ చెప్పారు. అనంతరం సైబర్ వాలంటీర్ నమోదు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర రెండో పట్టణా పోలీస్ స్టేషన్ యస్ఐ రుషేంద్ర మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ మోసాలు బాగా పెరిగిపోయాయని ముఖ్యంగా వృద్ధులు, మహిళలను లక్షంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రకరకాల పేర్లతో ఏమార్చి ప్రజలను దోచుకుంటున్నారని . అంతేకాక ప్రభుత్వ పథకాల పేర్లతోనూ మోసాలకు పాల్పడుతున్నరని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. ఎ.వి ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు భవిష్యత్ లో మరిన్ని కొత్త రూపాలు పొందుతాయని ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియని లింకులు మరియు ఓటీపీ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,కళాశాల ఏవో .శ్రీనాథ్ ,జతీయ సేవ పథకం పిఓ లు జి.ఆనంద్ బాబు , యస్.పురుషోత్తం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యమ డేంజర్.. పొంచి ఉన్న పెనుప్రమాదం

### – పట్టించుకోని ఉన్నతాధికారులు – ప్రమాదం జరిగితే ప్రాణాలు అంతే సంగతి..

### – ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఫైర్ జరిగితే రోగుల ప్రాణాలు గాలిలో దీపం




**అనంతపురం బ్యూరో, మేజర్ న్యూస్ :** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. పొంచి ఉన్న ప్రమాదాన్ని కనీసం పసిగట్టలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అధికార యంత్రాంగం ఉందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిస్థితి ఇలాంటి దయనీయంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. పేదల ప్రాణాలు అంటే కనీసం కనికరం లేని ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్న వారి కళ్లకు ఉన్న గంతలు తొలిగే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు.

**పొంచి ఉన్న పెను ప్రమాదం**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిత్యం మూడు వల మంది ఓపిఐపి ద్వారా వైద్య సేవలను పొందేందుకు వస్తుంటారు. కానీ వారి ప్రాణాలు మాత్రం అరచేతిలో పెట్టుకోవాల్సిన దరిద్రమైన పరిస్థితి ఇక్కడి ఉన్నతాధికారుల దౌర్భాగ్యం నేపథ్యంలో నెలకొంది. నిత్యం పర్యవేక్షిస్తున్న వాటి గురించి పరిరక్షించే కనీస అవగాహన కూడా లేని దరిద్రమైన పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారనేందుకు ఈ అంశమే ప్రధాన నిదర్శనంగా మారింది. వారి నిర్లక్ష్యం కారణం ఎంతోమంది ప్రాణాలకు చెలగాటంగా మారే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగాలైన గైనిక్ విభాగం, ఎస్ ఎన్ సి యు విభాగం, లేబర్ వార్డు, సర్జికల్ వార్డు, ఎస్ ఎన్ సి యు తో పాటుగా అత్యవసర వైద్య విభాగాలకు సంబంధించి ఫైర్ జరిగినప్పుడు దానిని అదుపు చేసేందుకు పెద్ద ఎత్తున అగ్నిమాపక సామాగ్రిని ఏర్పాటు చేశారు. కానీ పేద ప్రజల ప్రాణాలు అంటే కనీసం కనికరం లెక్కలేని తనంతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం వాటి నిర్వహణ అత్యంత దౌర్భాగ్యంగా మారింది. వాటికి సంబంధించిన పైప్ లైన్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. అత్యవసర వైద్య విభాగంలో కనీసం ఫైర్ జరిగితే అదుపు చేసేందుకు ఎలాంటి సామాగ్రిని కూడా ఏర్పాటు చేయకుండా కళ్ళు మూసుకొని వ్యవహరిస్తున్నారు. ఆయా అత్యవసర వైద్య విభాగాలలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఇక పేద ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. వాటి నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్రమంతంగా ఉండాల్సిన అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**చోరీకి గురైన సామాగ్రి**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిత్యం పర్యవేక్షణ ఉన్నప్పటికీ ఇక్కడ చోరీలు జరగడం సర్వసాధారణంగా మారింది. ఎటు చూసినా దొంగతనాలు జరగడం పరిపాటిగా ఉన్న నేపథ్యంలో అగ్నిమాపక సామాగ్రి మొత్తం ఎత్తుకెళ్లారని తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి. వీటికి తోడు వాటి నిర్వహణ మరమ్మతులు గురైన కూడా వాటిని ఏమాత్రం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం పై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం నేపథ్యంలోనే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉందంటే ఇక రాష్ట్రంలోని ఇతర జిల్లాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారు కనీసం అర్థం కాని పరిస్థితి ఇక్కడి రోగులలో నెలకొంది.

**గుణపాఠం నేర్వని అధికార యంత్రాంగం**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తొలి దశ కోవిడ్ సమయంలో రికార్డు రూము గదిలో చిన్నపాటి షాట్ సర్క్యూట్ నేపథ్యంలో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కానీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏ విభాగానికి వెళ్లిన అగ్ని ప్రమాదం సంభవిస్తే వాటిని ధైర్యంగా ఎదుర్కొనే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. ఎటు చూసినా ఎలాంటి అవగాహన లేని ఏమాత్రం జాగ్రత్తగా పాటించని వైనం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా వారి వ్యవహారం మారిందంటూ తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పర్యవేక్షణ చేసే అధికారులు కేవలం చూస్తూ గుడ్డి కళ్ళు అన్న చందంగా వారి వ్యవహారం మారింది. కనీసం ప్రమాదం జరిగిన తర్వాత నైనా వారు తమ విధానాలను మార్చుకొని ఎప్పటికప్పుడు ప్రమాదం జరిగితే ధైర్యంగా ఎదుర్కొంటామని చెప్పలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రస్తుతం అధికార యంత్రాంగం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఇంకా రోగుల ప్రాణాలు గోవిందా గోవిందాగా చెప్పవచ్చని తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు స్థానికంగా ఉంటూ సమస్యలను పరిష్కరించడం ఆసుపత్రిలో ఎలాంటి ప్రమాదం జరగకుండా చేపట్టాల్సిన చర్యల గురించి నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదయం పదికి వచ్చి 12 కు కనిపించకుండా పోతున్న వైనం పెద్ద ఎత్తున కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్యమైన ధోరణిని వీడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో యమ డేంజర్ వ్యవహారానికి చరమగీతం పాడుతారని ఆశిద్దాం..





# చీని రైతులకు శిక్షణ కార్యక్రమం



**తాడిమర్రి మేజర్ న్యూస్** తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామంలో బుధవారం చీనీ తోట రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం జిల్లా ఉద్యాన వన అధికారి జి చంద్రశేఖర్ సినీ రైతులకు తోటలలో పులుసు పురుగు యాజమాన్యం వేరుకుళ్ళు తెగుళ్లు యాజమాన్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు చీని తోటలకు తప్పనిసరిగా ముదులుకు మైలు తుత్తి బట్టి సున్నం కలిపిన మిశ్రమాన్ని సంవత్సరంలో రెండుసార్లు ఊత పూయాలని తెలిపారు ఎర్ర మట్టి క్లోరో ఫైర్ఫాస్ ఫ్లైట్ టాక్స్ డైక్లోరోఫాస్ సున్నం తగినంత నీటిలో కలిపి పూత పూయడం ద్వారా బంక తెగులు గొలుసు పురుగులు నివారించవచ్చునని వివరించారు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య మాట్లాడుతూ రైతులు సంవత్సరానికి రెండు లేదా మూడుసార్లు పశువుల ఎరువు వేప పిండి ట్రైకోడెమి విరిడి ల మిశ్రమాన్ని చెట్టుకు 10 కిలోల చొప్పున వేసుకోవడం ద్వారా వేడుకలు తెగులు నివారించవచ్చని ఆయన రైతులకు సూచించారు రైతులు ఎరువులు వేసేటప్పుడు ఒక్కసారి కాకుండా రెండు దఫాలుగా వేసుకోవాలని తెలిపారు తోటలలో కలుపు నివారణకు కలుపు మందులు వాడడం వల్ల చీని చెట్లు వేర్లు దెబ్బతిని చెట్లు చీనిస్తున్నాయని వాటికి బదులు చెట్ల మధ్యలో పచ్చి రొట్టె ఎరువులు వేయడం ద్వారా కలుపు నివారించడమే కాకుండా భూసారం పెరుగుతుందని సూచించారు ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి అమరేశ్వరి ధర్మవరం వ్యవసాయ అధికారి తాడిమర్రి అగ్రికల్చర్ అధికారి రమాదేవి రైతు సేవ కేంద్రం అధికారులు గౌతమి జయచంద్ర రైతులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే జిల్లా

# విస్తృత స్థాయి సదస్సును విజయవంతం చేయండి

**- ధర్మవరం రెవెన్యూ డివిజన్ కమిటీ**

**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని బత్తలపల్లి రోడ్డు సిఎన్‌బి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 13వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా విస్తృతస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ధర్మవరం డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశానికి సభా అధ్యక్షులుగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శ్రీ సత్యసాయి జిల్లా- సి. పుల్లయ్య, సదస్సు ప్రారంభకులుగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ తో పాటు ముఖ్య అతిథులుగా రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మాత్యులు జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు అనగానీ సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి, బీసీ సంక్షేమ, చేనేత అండ్ జౌళి శాఖ మాత్యులు ఎస్ సవితమ్మ తో పాటు విశిష్ట అతిథిగా పార్లమెంటు సభ్యులు బి కే.పార్థసారథి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. గౌరవ అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, ప్రత్యేక అతిధులుగా జిల్లా కలెక్టర్ చేతన్, జిల్లా ఎస్పీ రత్న, ఆత్మీయ అతిథులుగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ధర్మవరం ఆర్డీవో మహేష్, ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్ పాల్గొంటారని, అదేవిధంగా ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి. సుబ్బారావు,







రాష్ట్ర కార్యదర్శి చందు జనార్ధన్, జాతీయ కార్యదర్శి సోమ సుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సురేష్ కుమార్, ఎం. ప్రసాద్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఏచూరి శివ, జిల్లా అధ్యక్షులు ఎల్. హరికృష్ణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, ఐజేయు కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు జీవీ నారాయణ పాల్గొంటున్నారని తెలిపారు. కావున జిల్లాలోని పాత్రికేయులందరూ కూడా సకాలంలో ఈ జిల్లా విస్తృతస్థాయి సదస్సులో పాల్గొని, విజయవంతం చేయాలని వారు తెలిపారు. ఈ విస్తృత సాయి సదస్సులో పాత్రికేయుల సమస్యలు, తదితర అంశాలు కూడా ఉంటాయని తెలిపారు.

# జీవానంద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

**-ఆర్డీఓకు వినతి పత్రం అందించిన విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** జీవానంద పాఠశాల నందు ఎల్కేజీ చదువుతున్న ఎస్ ప్రజ్వల్ నంద అనే విద్యార్థి యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ప్రమాదవశాత్తు మండుతున్న అగ్గిమంటల్లో పడ్డాడు మోకాలికి గాయాల పాలయ్యాయి. అక్కడున్నటువంటి యాజమాన్యం గతంలో కూడా ఎన్నో విధాలుగా విద్యార్థి సంఘాలుగా విద్యాశాఖ అధికారులకు కంప్లైంట్ చేసిన కూడా పాఠశాల యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఫీజులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ కనీసం విద్యార్థులకు రక్షణ కల్పించడంలో లేకపోవడం చాలా బాధాకరం ఈరోజు విద్యార్థికి అగ్గిలో పడి ఆయన పాలైతే యజమానం ఏమాత్రం కూడా పట్టించుకోకుండా గాలికి వదిలేసి విద్యాశాఖ అధికారులతో సంప్రదింపులు చేసుకుంటున్నారు తమరైన తక్షణమే స్పందించి పాఠశాల నిర్లక్ష్యంకు రూ. 5లక్షలు విధించాలని ఐక్య విద్యార్థి సంఘాలుగా కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



## నేడు మండలంలో మంత్రి పర్యటన

**తాడిమరి మేజర్ న్యూస్** తాడిమరి మండలంలో గురువారం నాడు మంత్రి పర్యటన ఏర్పాటు చేసినట్లు బిజెపి మండల కన్వీనర్ దేవర రామ మోహన్ బుధవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో మరో పల్లి శివంపల్లి గ్రామాల్లో మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యటన ఉన్నట్లు ఆయన మరవ పల్లిలో సిసి రోడ్ల ప్రారంభోత్సవం అదేవిధంగా శివంపల్లి గ్రామంలో బీసీ కాలనీ యందు తాగునీటి ప్లాంట్ మినరల్ వాటర్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## తోలుబొమ్మలాట ధర్మవరం వాసికి ఘన సత్కారం



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మలాట కళాకారుడు, గురువు షిండే చిదంబర రావుకు బొంబాయిలో ఇటీవల అతని ప్రదర్శనకు ఘన సత్కారం లభించింది. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ ఇటీవల బొంబాయి లోని కేటీ ఏరియాలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి తోలుబొమ్మలాట కళాకారుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ ప్రదర్శనలో తనతో పాటు 8మంది కళాకారులు తోలు ప్రదర్శనను నిర్వహించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రదర్శించిన మా తోలుబొమ్మలాట అందరిని విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. తాను 48 సంవత్సరాలుగా తోలుబొమ్మలాట కళాకారుడుగా, గురువుగా ఉంటున్నానని, భారత దేశము, ఇతర దేశాలైన లండన్, జర్మనీ, స్పెయిన్, ఈజిప్ట్, మెక్సికో, ప్యారిస్, ఫ్రాన్స్, ఉమెన్ మస్కట్ దేశాలలో నా ప్రదర్శన నిర్వహించడం గర్వంగా ఉందని, భారతదేశ సంస్కృతి కళలనుచేయడం నిజంగా నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. భారతదేశ ప్రధాని మోడీతో కూడా తాను ప్రశంసలు అందుకోవడం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కళాకారులను మరింత ఆదుకునే దిశలో చర్యలు చేపట్టాలని తెలిపారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

**- మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని జివిఇ జెడ్పి ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. తదుపరి ఈ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ"జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు విద్యార్థి దశలో ఆచరించదగిన అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలలో ప్రతిభ ఘనపరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో జి. అలేఖ్య, ఎస్. చరిత, వి. సృజన అనే విద్యార్థులకు పాఠశాల హెడ్మాస్టర్, స్వచ్ఛంద సేవా సంస్థల వారి చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తల్లం నారాయణమూర్తి, సభ్యులు మనోహర్ గుప్తా, రమేష్, కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వేదిక్

## మాథ్స్ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాగులూరు గ్రామం వద్ద ఉన్న రూపా రాజా పీసీఎంఆర్ పాం శాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉష్రశ్రీ రాష్ట్రస్థాయి వేదిక్ మాథ్స్ పోటీలలో ప్రతిభ కనబరచడం జరిగిందని రూపా రాజా పీసిఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతోపాటు వివిధ పోటీ పరీక్షలు కూడా నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన నైపుణ్యమును, జ్ఞానమును ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. విశ్వం ఎడిటెక్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన స్టార్ జూనియర్ లెవెల్ 3 రాష్ట్రస్థాయి వేదిక్ మాథ్స్ పోటీలలో పాల్గొని తృతీయ స్థానం పొందడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇంక నువ్వు మ్యాచ్లో మున్ముందు మంచి ప్రతిభ కనబరచాలని వారు తమ ఆశీస్సులను అందజేశారు. తదుపరి చైర్మన్ హర్షవర్ధన్ తో పాటు డైరెక్టర్లు రూపా రాధాకృష్ణ, జగదీష్, కర్రీస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు అభినందన శుభాకాంక్షలును ప్రతిభ కనబరిచిన ఉష్రశ్రీ కు తెలియజేశారు.

# రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

**– మండల వ్యవసాయ అధికారిణి భారతి**

నల్లచెరువు, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూమి గల ప్రతి రైతన్న కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారిని భారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతన్నలకు అండగా వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు పారదర్శక ఉద్దేశంతో వ్యవసాయ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ. ప్రభుత్వం సమన్వయంతో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చేపడుతున్న గొప్ప కార్యక్రమం, రైతులకు అందించే గుర్తింపు సంఖ్య, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రభుత్వ పథకాలకు సబ్సిడీ లకు, ఇతర వ్యవసాయ సేవలు ఈ సంఖ్య ప్రత్యేక గుర్తింపుగా వర్తింప చేస్తుం దని,పీఎం కిసాన్. పంట రుణాలపై రాయితీ, సూక్ష్మసేద్య



పథకాలు సబ్సిడీ పంట పెట్టుబడి సాయం, రైతన్నలు నేరుగా లబ్ధి పొందేందుకు ఈ సంఖ్య వర్తింప చేస్తుందన్నారు. సకాలంలో రైతన్నలు అన్ని సమాచారాలు అందుకునేందుకు తోడ్పడుతుందని. మండలం లో ప్రతి రైతు సేవ కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్ లింక్ గల ఆధార్ కార్డులు తీసుకెళ్లి రైతు సేవా కార్యాలయంలో సిబ్బంది సంప్రదించాలని, ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తేవాలని మండల వ్యవసాయ అధికారిని భారతి తెలిపారు.

## వైసీపీ కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డికి ఘన సన్మానం



డి. హీరేహాళ్ మేజర్ న్యూస్ : మండల వైసీపీ నూతన కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి ఎన్నికైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి విచ్చేసిన ఆయనను బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు తొండ వెంకటేశులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాడెనహళ్లి బొమ్మన్న, మర్రి స్వామి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోరంట్లలో ఉద్యోగ మేళా..



పుట్టపర్తి మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లాలో వున్న నిరుద్యోగ యువతీ యువకులు కొరకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ అభివృద్ధి అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో గోరంట్లలోని ఏఎన్కె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురు వారం జాబ్ మేళా ను నిర్వహిండం జరుగుతుంద న్నారు. 6 కంపెనీల ప్రతినిధులు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు, 18 నుంచి 35 సంవత్సరాలు లోపు ఉన్న వారు అర్హులు అన్నారు. ఇంటర్వ్యూ కి హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా తో పాటు ,ఆధార్ కార్డ్, విద్యార్హత పత్రాలు తీసుకొని ఉదయం తొమ్మిది గంటలకి హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి నారాయణ, జిల్లా నైపుణ్యా అధికారి హరి కృష్ణ తెలియజేసారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం



నంబులపూలకుంట, మేజర్ న్యూస్ : మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో భాగంగా బుధవారం మేకల చెరువు పంచాయతీ అరవ వాండ్ల పల్లి, ఎదురుదొన గ్రామాలలో మామిడి రైతులకు ఉద్యాన అధి కారి ప్రతాప్ రెడ్డి ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం మామిడి పంట పూత దశలో ఉందని, చెట్లకు ఎరువులు వేసి నీటి సదు పాయం కల్పించాలి. వీలైనంతవరకు పురుగు మందులు పిచికారీ చేయరాదన్నారు. మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో భూమి ఉన్న ప్రతి రైతు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతు విశిష్ట గుర్తింపు కార్డు పొందేందుకు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, ఆధార్ తో అనుసంధానమైన మొబైల్ ఫోను వెంట తీసుకుని నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది హరి నాథ్ రెడ్డి, సున్ను భాష, రైతులు పాల్గొన్నారు.

## వీరనారాయణ స్వామి పరుషలో దుకాణాల ఏర్పాటుకు వేలం

ముదిగుబ్బ, మేజర్ న్యూస్ :మహాశివరాత్రి పర్వదినాల సందర్భంగా మండల పరిధిలోని సంకేపల్లి పరుస మానులలో నిర్వహించే వీర నారాయణ స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల కొరకు గురువారం దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శివరాత్రి సందర్భంగా పరుస మానులలో 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించే జాతరలో టెంకాయ లు, పూజా సామాగ్రి, తిను బండారాల దుకాణాల ఏర్పాటుకు చేయదల్చడానికి ఆసక్తి గలవారు వేళములో పాల్గొనాలన్నారు. ప్రతి పాతశాలలో 5000 రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అధిక మొత్తం వేలం పొందిన వారు మొత్తం సొమ్ము అప్పటికప్పుడే చెల్లించాలన్నారు. దుకాణాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ : తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్న తరుణంలో పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ దామోదర్ నాయుడు, వైద్యశాఖ డైరెక్టర్, జిల్లా అధికారులతో విడివిడిగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లాలో నిత్యం ఫారం కోళ్ల రవాణా నిషేధించాలని, కోళ్ల ఫారాలను విజిట్ చేసి పై అధికారులకు ఇచ్చిన సూచనలు పాటించాలని జిల్లాలో ఉన్న డిప్యూటీ డైరెక్టర్లకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారుల వద్దకు కోళ్లు గుడ్లు టెస్టింగ్ కోసం తెస్తే వాటిని టెస్ట్ చేసి రిపోర్ట్ ఇవ్వాలని మీ పరిధిలో ఉన్న సిడాల్స్ స్టాఫ్ కు సూచన ఇవ్వాలని తెలిపారని శ్రీ సత్య సాయి జిల్లా పశుసంవర్ధక శాఖ డి ఏ హెచ్ ఓ సుభదాసు తెలిపారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటి గురించి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ని ఫిరోజ్ బేగంకు రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్ వీడియో కాన్ఫారెన్స్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని ఫిరోజా బేగం మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపించక మునుపే తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్ బెగం, ఎస్ ఓ కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

కదిరి, మేజర్ న్యూస్ : కదిరి, నల్లచెరువు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ మెయిన్, మినీ, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం కదిరి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎన్ఎస్ఎస్ శర్మ అధ్యక్షతన ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగింది. అభ్యర్థులకు ఐసిడిస్ పిడి వరలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ వో డాక్టర్ నాగేంద్ర నాయక్, సిడిపివోలు రాధిక, జయంతి ఇంటర్వ్యూ లు నిర్వహించారు. ధనియాల చెరువు మినీ అంగన్వాడి కార్యకర్త పోస్టుకు 7 మంది ఇంటర్వ్యూలకి హాజరయ్యారు. కదిరి మండలం మాచిరెడ్డిపల్లి అంగన్వాడి నాయకురాలికి పోస్ట్ కు ఒకరు, మల్లయ్య గారి పల్లి ఆయా పోస్టుకు ముగ్గురు, నల్లచెరువు ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో నల్లచెరువు మండలం ఊపుచర్ల మెయిన్ పోస్ట్ కు ముగ్గురు, ఆయా పోస్టులకు ముగ్గురు, దేవ రెడ్డి పల్లి ఆయా పోస్టుకు ఇద్దరు చొప్పున ఇంటర్వ్యూలకు హాజరైనట్లు సిడిపివోలు



తెలిపారు. మొత్తం రెండు ప్యాకెట్లు పరిధిలో 30 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది కళ్యాణి ,ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలో వెలసినటువంటి శ్రీ పేట వెంకటరమణ స్వామి దేవస్థానంలో శ్రీ వారి బ్రహ్మ రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తాదుల నడుమ గోవిందా గోవింద నామస్మరణతో రథోత్సవం నిర్వహించారు. ఈ బ్రహ్మో త్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే పిఏ బాలాజీ, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, భక్తాదులు పాల్గొన్నారు.

## బ్రహ్మరథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు “శ్రీ పేట వెంకటేశ్వర స్వామి” వారి బ్రహ్మరథోత్సవం సందర్భంగా బ్రహ్మాండ నాయకునికి సువర్ణ రత్న మణిమయ మకుట దివ్య మంగళ రూపంతో, సువర్ణ ఆభరణాలతో అలంకరించిన స్వామి వారి మూల విరాట్ ను దర్శించుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికమ్మ ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దీపికమ్మను వేదమంత్రాలతో ఆశీర్వదించి, దుశ్శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రబాబు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మహేష్ గౌడ్, కొల్లకుంట శివశంకర్ రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, న్యాత రెడ్డి, అయూబ్ బైగ్, గిరి, కవిత రెడ్డి, వెంకటేష్ రెడ్డి, నవీన్, హరి తదితరులు పాల్గోన్నారు.



## డిఎంహెచ్ఓ పెన్షన్ దారుల వెరిఫికేషన్



పరిగి మేజర్ న్యూస్: పరిగి మండలంలో డి ఎం హెచ్ ఓ పెన్షన్ దారుల వెరిఫికేషన్ వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో పరిగి పీహెచ్ సి వైద్యులు నవీన ఇందురేఖ సమక్షంలో హొన్నంపల్లి ధనాపురం నర్సాపురం పైడిటీ ఎర్రగుంట గ్రామాల్లో ఉన్న డిఎంహెచ్ఓ పెన్షన్ వెరిఫికేషన్ తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు వెల్ఫేర్ అసిస్టెంట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా గ్రంధాలయ అధికారి ఆకస్మిక తనిఖీ

నల్లచెరువు, మేజర్ న్యూస్ : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయాధికారిణి రమా ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయల రికార్డులు, హాజరు పట్టిక పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాల పట్టిన వలన మేదస్సు పెరుగుతుందని, పోటీ పరీక్షలకు సైతం ఉపయోగ పడేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రంథాలయంలో పుస్తకాలను అందుబాటులో ఉంచారని, ఒక మంచి పుస్తక పఠనతో ఎక్కడా లేని మేధస్సు లభిస్తుందని, పుస్తక పఠనంతోనే సాధ్యమని అందుబాటులో ఉండే పుస్తకాలను రోజు చదవడం అల వాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు విద్య మెదస్సు, మానసిక బలం కోసం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంధాల అధికారి ప్రసాద్ నాయక్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# బళ్లారి - గుండ్లపల్లి రోడ్డును జాతీయ రహదారిగా మార్చండి

## - కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమా శంకర్‌కు ఎంపీలు, ఎమ్మెల్యే వినతి

**రాయదుర్గం, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని ఎన్.గుండ్లపల్లి - బళ్ళారి ప్రధాన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తూ అభివృద్ధి చేయాలని కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమా శంకర్ కు ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపీలు బికె పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని కేంద్ర రవాణా కార్యాలయంలో బుధవారం ఆయనకు వినతి పత్రం సమర్పించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలను కలిపే ఈ అంతరాష్ట్ర రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకల రద్దీ అధికంగా ఉందని వివరించారు. ముఖ్యంగా బళ్ళారి, రాయదుర్గం ప్రాంతంలో ఇనుప ఖనిజ సంబంధిత పరిశ్రమలు, ఇతరత్రా భారీ పరిశ్రమలకు చెందిన పెద్ద వాహనాలు, కంటైనర్లు వందల సంఖ్యలో వెళుతుంటాయని పేర్కొన్నారు. వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పరిసర గ్రామాల ప్రజలు వాయు కాలుష్యం తో జబ్బుల బారిన పడుతున్నారని వెల్లడించారు. కర్ణాటకలోని బళ్ళారి నగరం నుండి ఆంధ్ర పరిధిలోని ఉద్దేహల్, బొమ్మనహల్, కనేకల్లు, కళ్యాణదుర్గం మీదుగా తిరిగి కర్ణాటకలోని పావగడ, తుమకూరు ప్రధాన పట్టణాలకు వెళ్ళడానికి ఈ



రహదారి కీలకమని తెలియచేశారు. బళ్ళారి మీదుగా వెళ్లే 67వ నెంబర్ జాతీయ రహదారి (బళ్ళారి బై పాస్) నుండి 52 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి వేపరాళ్ల వద్ద 544డి జాతీయ రహదారితో కలుస్తుందని తెలిపారు. తుమకూరు నుండి కొరటగేరే, మడకశిర, పావగడ, కళ్యాణదుర్గం మీదుగా వేపరాళ్ల వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా మార్చడానికి కేంద్రం ఇదివరకే అంగీకరించిందని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాలను కలిపే బళ్ళారి బైపాస్ నుండి ఎన్.గుండ్లపల్లి వరకున్న ఈ 52 కిలోమీటర్ల పొడవైన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. అలాగే రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని డి.హీరేహల్ మీదుగా వెళుతున్న 150ఏ జాతీయ రహదారిపై డి.హీరేహల్ మండల కేంద్రంలో బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం చెపుతున్న విషయాన్ని మరో వినతిపత్రంలో కార్యదర్శి ఉమా శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. కర్ణాటక పరిధి లోని బళ్ళారి నుండి హిరియూరుకు వెళ్లే జాతీయ రహదారి మధ్యలో ఆంధ్ర పరిధిలోని డి.హీరేహల్ మీదుగా వెళుతుందని తెలిపారు. మండల కేంద్రాన్ని రెండుగా విభజించేలా బాక్స్ మోడల్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులు డిజైన్ చేశారని వివరించారు. దీనివల్ల గ్రామం రెండుగా విడిపోతుందనే ప్రజలు ఆందోళన గుర్తించి బాక్స్ బ్రిడ్జి బదులు ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. ఈ మేరకు డిజైన్ లో మార్పు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పై రెండు వినతులపై కార్యదర్శి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలియచేశారు. బళ్లారి - గుండ్లపల్లి రోడ్డును ఏడాది లోపు జాతీయ రహదారిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హీరేహాల్ వంతెన విషయంలో సాధ్యమైనంత త్వరగా సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఉమాశంకర్ భరోసా ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాలవ తెలిపారు. రెండు సమస్యలకు త్వరలో తప్పక పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తపరిచారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్: 63011 07116

# ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదు

## - తల్లిని బిడ్డను కాపాడుకోవడానికి మనం పని చేస్తున్నామని గుర్తెరగాలి - జిల్లా వైద్యాధికారి ఫైరోజా బేగం

**శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** మనమంతా తల్లి బిడ్డను కాపాడుకోవడానికి పనిచేస్తున్నామని, ఏ తల్లి బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదు.. ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదు అని జిల్లా డి ఎం హెచ్ వో ఫైరోజో బేగం వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జనవరి 2025 మాతృ మరణాలకు, శిశు మరణాలకు సంబంధించి జిల్లాస్థాయి సబ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో జనవరి నెలలో మాతృ మరణం ఒకటి సంభవించాయన్నారు. పుట్టపర్తి పిహెచ్సి మాతృ మరణం, శిశు మరణాలు నాలుగు నాలుగు, రోద్దం పీహెచ్సీ ఒకటి, యు పి హెచ్ సి శ్రీనివాస నగర్ హిందూపూర్ 1, పెద్ద ముంతూర్ పిహెచ్సి 1, యు పి హెచ్ సి ధర్మవరం




సాయి నగర్ 1 జరిగా యన్నారు. పైన పేర్కొన్న పీహెచ్సీ, యు పి హెచ్ సి మెడికల్ అధికారులతో, ఆయా పీహెచ్సీలకు సంబంధించిన ఆరోగ్య సిబ్బందితో డిఎంహెచ్వో ప్రతి కేస్ కు సంబంధించి క్షుణ్ణంగా రివ్యూ నిర్వ హించారు. డిహెచ్ఓ మాట్లాడుతూ ఎక్కడైతే లోపాలు ఉన్నాయి వాటిని వెలికి తీసి చక్కదిద్దు కుంటే ప్రతి బిడ్డను ప్రతి తల్లిని కాపాడు కోవచ్చు అన్నారు. ప్రతినెల 9వ తేదీన పీహెచ్సీలో జరుగు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ రోజున గర్భవతులకు గ్రూప్ సమావేశం ఏర్పాటు చేసి ఆరోగ్యం పై ప్రత్యేక సూచనలు సలహాలు ఇవ్వాలని, వ్యాధి నిరోధిక టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సునీల్, అస్తరునిసా బేగం, డి పి హెచ్ ఎన్ ఓ వీరమ్మ, అబ్దుల్ హుస్సేన్, పిహెచ్సి వైద్యాధికారులు, సూపర్వైజర్లు ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్న వారిలో ఉన్నారు.



# సే నో టు డ్రగ్స్ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : మాదకద్రవ్యాల రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం లో భాగంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము ఔషధ కళాశాల యందు ' సే నో టూ డ్రగ్స్ ' పేరున పోస్టర్లు విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అనితా, రిజిస్ట్రార్ డా. ఇ. రమేష్ , ఔషద కళాశాల డైరెక్టర్ డా. పి.వెంకట రమణ ,ప్రిన్సిపాల్ డా జి.సోమశేఖర్, యన్ యస్ యస్ యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్ డా పి.సత్య సౌమ్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వలన జరిగా అనర్థాలు, వాటి నిర్మూలన మార్గములు గురించి వివిధ చిత్రలేఖ నం ద్వారా విద్యార్థులచే పోస్టర్లు వేయించి వాటి వలన జరిగే అనర్థాలు నిర్మూలన మార్గములు పైన అవగాహన కల్పించడం జరిగింది.

# వ్యవసాయ అధికారుల సంఘం డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

అనంతపురం రూరల్ మేజర్ న్యూస్: వ్యవసాయ అధికారుల సంఘం 2025 సంవత్సర డైరీని బుధవారం జిల్లా కలెక్టరేట్ ని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆవిష్కరించారు. నూతన సంవత్సర వ్యవసాయ అధికారుల సంఘం డైరీ లో రైతులకు ఉపయోగపడే సమాచారం బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ , డిడిఏ మద్దిలేటి , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వాసు ప్రకాష్ జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం వెంకట రాముడు ,కార్యదర్శి ఏ వెంకట కుమార్ ,కోశాధికారి శ్యాంసుందర్ రెడ్డి, చిన్నమ్మ రాకేష్ నాయక్ సోమశేఖర్ పెన్నయ్య ఎల్లప్ప కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా మిట్టబండ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

## - స్వామి వారి రథాన్ని లాగుతూ, భక్తిభావాన్ని చాటుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర, మేజర్ న్యూస్ : స్థానిక పట్టణం లోని ప్రసిద్ధి చెందిన మిట్ట బండ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ శుభ కార్యక్రమానికి స్థానిక తెదేపా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. తొలుతగా స్వామి వారిని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు .



అనంతరం గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి రథోత్సవం లో భాగంగా స్వామి వారి రథాన్ని వందలాది మంది భక్తాదుల మధ్య గుండుమల తిప్పేస్వామి లాగుతూ, స్వామి వారి పట్ల తన కున్న భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం బ్రహ్మోత్స వాలకు తరలి వచ్చిన భక్తాదులకు ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వందలాది భక్తాదులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# మహా కుంభమేళాలో రెపరెపలాడిన జనసేన జెండా...

## - సనాత ధర్మ సంరక్షణకు నడుము కడతాం..
## - జనసేన నగర కార్యదర్శులు లాల్ స్వామి రాయల్, వల్లం శెట్టి రమణ

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ఉత్తరప్రదేశ్ ప్రయోగ్ రాజ్ లో ఎంతో వైభవంగా జరుగుతున్న త్రివేణి సంగమం పరివాహక ప్రాంతం మహా కుంభమేళలో జనసేన జెండా రెపరెపలాడింది. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ... సనాతన ధర్మ పరిరక్షణకు నడుం బిగించినట్లు




జనసేన నగర కార్యదర్శులు లాల్ స్వామి రాయల్, వల్లం శెట్టి రమణలు అన్నారు. కుంభమేళ త్రివేణి సంగమంలో పవిత్ర స్థానం ఆచరిస్తే ముక్కోటి దేవతల ఆశీర్వాదం ఉంటుందని.. తమ అధినేత పవన్ కళ్యాణ్ కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని.. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో దేశంలోనే అగ్రగామిగా నిలపాలని.. వల్లంశెట్టి రమణ, లాల్ స్వామి రాయల్ ఆకాంక్షించారు.



## వైస్ ఛాన్సలర్ల నియామకాలలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి

**– రాష్ట్ర చీఫ్ సెక్రటరీకు ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం వినతి**

అనంతపురం రూరల్ మేజర్ న్యూస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియమాకాలలో ఎస్సీ ,ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని అమరావతి లోని రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కు కె విజయనంద్ ను ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎస్సీ ,ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర డైరీ ని చీఫ్ సెక్రటరీ విజయనగరం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే 26 యూనివర్సిటీల వైస్ ఛాన్సర్ నియామకలలో ఎస్సీ ఎస్టీ బీసీల ప్రాతినిధ్యం ఉండేలా తగు చర్యలు చేపట్టాలని చీఫ్ సెక్రటరీని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు దాదాపు 23.1 శాతం జనాభా మేరకు మొత్తం 26 యూనివర్సిటీల గాను ఆరు యూనివర్సిటీలకు తక్కువ కాకుండా వైస్ ఛాన్సర్లుగా ఎస్సీ, ఎస్టీల ప్రాధాన్యత , ప్రాతినిధ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నమ్ముతున్నట్లు ఆయన తెలిపారు.భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 ప్రకారం సమాన అవకాశాలు, ఆర్టికల్ 16 ( 4) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల లో ఎస్సీ ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టంగా చెబుతోందన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం ఏదీ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పౌరులు లేదా షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం రాష్ట్రం ఏదైనా ప్రత్యేక నిబంధనను చేయకుండా నిరోధించదని ఆధారంగా నియామకాలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పాటిస్తుందని నమ్ముతున్నామని తెలిపారు. చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ జిల్లా సంఘం నాయకులు అశోక్ , రత్నం , అనంతపురం జిల్లా నాయకులు శ్రీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ సముదాయాల సమయాన్ని మార్చాలి.. ఏపీ వైఎస్ఆర్ టిఏ

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : స్కూల్ సముదాయాల సమయాన్ని మార్చాలని ఏపీ వైఎస్ఆర్టిఏ అనంతపురం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు అయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11:45 నిమిషాల వరకు పనిచేస్తున్న పాఠశాలలో తరగతులు నిర్వహించి, తర్వాత దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు ఒక గంటలో చేరుకోవడం సాధ్యమేనా ? కొన్ని సందర్భాలలో ఉపాధ్యాయులు రెండు వాహనాలు మారి గమ్యస్థానం చేరుకోవాలి. రెండు వాహనాలు మారి క్లస్టర్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు గంటలో రెండు వాహనాలు అందుబాటులో ఉంటాయా. పంచాయతీ వారిగా క్లస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల కొన్ని పాఠశాలలు క్లస్టర్ కి చేరుకోవడానికి దూరంగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయాలి. మరి భోజనం ఎప్పుడు చేయాలి. కనీసం భోజనానికి అరగంట సమయం కేటాయించకపోతే ఎలా. ఈ తొందరలో ఉపాధ్యాయులకు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అదేవిధంగా పాఠశాలల పనివేలలు సాయంత్రం నాలుగు గంటల వరకే కావున ఆ సమయానికే సమావేశాలు ముగింపు చేయాలని, ఉన్నతాధికారులు ఆలోచించి తగు నిర్ణయం తీసుకుని క్లస్టర్ సమావేశాలు సౌకర్యవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేయాలని ఏపీ వైయస్సార్ టి ఏ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్. డిమాండ్ చేశారు.

## రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సి. నాగప్ప

అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ : రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులుగా సి నాగప్ప ఎన్నికయ్యారు.మంగళవారం జరిగిన రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి సమావేశం సమావేశంలో సి నాగప్ప జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి లింగమయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ... గతంలో ఎన్నో పోరాటాలలో పాల్గొని అనుభవంతో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన నాగప్ప మాట్లాడుతూ... రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని తెలిపారు.



# కుక్కల నియంత్రణ పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తప్పవు

**– 15 రోజుల్లో నగరంలో కుక్కల నియంత్రణకు చర్యలు.. ఎమ్మెల్యే దగ్గుపాటి**

**– 17వ డివిజన్‌లో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం**

**– కూటమి ప్రభుత్వం వచ్చాక 25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్న ఎమ్మెల్యే**

**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి :** అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో కుక్కల పేరుతో 45 లక్షల రూపాయల అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఖచ్చితంగా దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 17 డివిజన్ లో ఆయన మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి అధికారులు, స్థానిక నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీలో వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఇక్కడ కనీసం చిన్న పని కూడా చేయకుండా ప్రజలను ఇబ్బంది పెట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 25 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. నాలుగు పంచాయతీల పరిధిలో ఆరున్నర కోట్ల రూపాయలతో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. నగరంలో కుక్కల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని 15 రోజుల్లో ఇందుకు సంబంధించిన పనులు మొదలవుతాయన్నారు. మరోవైపు జాతీయ రహదారి పనులు సరిగా చేయలేదని ఎక్కడ చూసినా వంకర టింకర రోడ్లు కనిపిస్తున్నాయన్నారు. క్లాక్ టవర్ వద్ద కూడా రోడ్డు సమస్య ఉందని దానికి త్వరలోనే పరిష్కారం



చూపిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మణికంఠ బాబు, సికిందర్, పోట్ల వేణు, నాగేశం నాయుడు, నాగరాజు, హరి ప్రసాద్, సాయి ఈశ్వరి, మాజీ కార్పొరేటర్లు సరిపుటి రమణ, రాజారావు, పలు కార్పోరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీ నరసింహులు, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి నాయకులు గోపాల్ గౌడ్, ముస్తాక్, ఎన్.బి.కె శ్రీధర్, తాటి మధు, ఇస్మాయిల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీ యజమాని.. ఆరోపణలు అవాస్తవం

**– అబద్ధాలతో అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారు – నరాల సాయి అఖిల్**

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : డీఎస్పీ రెడ్డి గ్యాస్ ఏజెన్సీ యజమాని రేవతి తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని నరాల సాయి అఖిల్ స్పష్టం చేశారు. ఆమె ప్రతిష్టకు భంగం కలిగేలా ఇన్స్టాగ్రామ్ లో తాను ఫోటోలు పోస్టు చేయలేదని తెలిపారు. డిఎస్పి రెడ్డి గ్యాస్ ఏజెన్సీ తో భాగస్వామ్య వ్యాపారం నిర్వహించినప్పటికీ.. ఆ ఏజెన్సీ యజమాని రేవతి ఆర్థిక వనరుల నిర్వహణ సరిగా లేకపోవడం కారణంగా భాగస్వామ్యం నుంచి బయటికి వచ్చానని నరాల సాయి అఖిల్ తెలిపారు. రేవతికి అవసరమైనప్పుడల్లా... తాను చెల్లించిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. డిఎస్పి రెడ్డి గ్యాస్ ఏజెన్సీ తో ఒప్పందం కుదుర్చుకునే సందర్భంలో తాను చెల్లించిన డబ్బు లో.. కేవలం సగం మాత్రమే రేవతి తనకు తిరిగి ఇచ్చిందని చెప్పారు. మిగిలిన సగం ఇవ్వకుండా.. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని నరాల సాయి అఖిల్ వాపోయారు. నగదు రూపంలో తనకు డబ్బు



చెల్లించానని రేవతి చెబుతోందని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. తను బ్లాక్ మార్కెటింగ్ చేశానని రేవతి చేసిన ఆరోపణలు అవాస్తవమని నరాల సాయి అఖిల్ స్పష్టం చేశారు. తనతో ఒప్పందంలో ఉండగానే.. తనకు తెలియకుండానే కృష్ణారెడ్డి అనే వ్యక్తితో 49 శాతం భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. వివిధ దశల్లో తాను 67 లక్షలు రేవతికి చెల్లించానని, ఆమె కేవలం 33 లక్షలు మాత్రమే తనకు తిరిగి చెల్లించిందని నరాల సాయి అఖిల్ పేర్కొన్నారు. భారత్ గ్యాస్ ప్రతినిధులకు రేవతిపై ఫిర్యాదు చేసేందుకు అనంతపురం నుంచి కర్నూలు వరకు సైకిల్ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్రయాణంలో తనకు ఎలాంటి హాని జరిగినా రేవతి, ఆమె మేనేజర్, కృష్ణారెడ్డి కారణమని నరాల సాయి అఖిల్ తెలిపారు.

## విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి.. జిల్లాలో మొదటి స్థానంలో నిలవాలి

**– మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో గుండుమల తిప్పేస్వామి**

**మడకశిర, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ విద్యార్థులు మంచి ఉత్థిర్ణ సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలవాలంటే ఉపాధ్యాయులు పాత్ర ప్రధానమైనదని మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక పట్టణం లోని ఆర్ అండ్ బి వసతి గృహం వద్ద ఆయన ఐదు మండలాల విద్యాశాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం లోని విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉత్థిర్ణత శాతం పెంచే బాధ్యత విద్యాశాఖ అధికారులకు ఉందన్నారు .అదేవిధంగా నియోజకవర్గంలోని పాఠశాల



భవనాల స్థితిగతులను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిని పునర్నిర్మించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ ను నిర్వీర్యం చేసి , నాడు నేడు పథకం ద్వారా వైసీపీ నాయకుల జోబులు నింపుకున్నారే తప్ప చేసింది ఏమి లేదన్నారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర కాపల పెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెదేపా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లోవిద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల పట్ల అన్ని సౌకర్యాలు, వసతులు ప్రభుత్వపరంగా కల్పిస్తున్నారన్నారు.విద్యార్థులు ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకుంటూ, మంచి విద్య ను అభ్యసించాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధికారులు చూడాలని గుండుమల తిప్పేస్వామి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, అన్ని మండలాల విద్యాధికారులు, మండల కన్వీనర్లు మద్దనకుంటప్ప, లక్ష్మీనారాయణ, గణేష్, ప్రధాన కార్యదర్శి, రంగే గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ బీమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.





## అంకితభావానికి కేరాఫ్... ఏఎస్ఐ రమణ

**- సత్యసాయి జిల్లా పోలీస్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటులో ప్రత్యేక గుర్తింపు**
**- ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా సన్మానం**



బుక్కపట్నం మేజర్ న్యూస్ : బుక్క పట్నం మండల ఏఎస్ఐ రమణ అంకితభావంతో ప్రజల మనసులు చూరగొన్నారు. ఆయన మండలంలో విధుల్లోకి చేరినప్పటి నుంచి వృత్తిపట్ల అంకితభావం చూపడమే కాకుండా స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడు పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని వారి సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్న మంచి పేరును సంపాదించుకున్నారు. ఫ్రెండ్లీ పోలీస్ ఎలా ఉంటాడు నిరూపించారు. ఏ బాధ్యతలు అప్పగించినా బాధ్యతతో ఆ పని పూర్తి చేస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా పొందారు. పుట్టపర్తి కేంద్రంగా నూతనంగా ఏర్పడిన జిల్లాలో పోలీస్ ఫైరింగ్ మైదానం కోసం బుక్కపట్నం మండలం చంద్రాయుని పల్లి వద్ద ఉన్నతాధికారులు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఆ స్థలాన్ని అణువుగా చక్కదిద్దే బాధ్యత ఏఎస్ఐ రమణకు అప్పగించారు. రాళ్లు గుట్టలను తొలగించే పనులను నిరంతరం పర్యవేక్షించి ఉన్నతాధికారుల సూచన మేరకు భవిష్యత్తులోనూ ఇబ్బందులు రాకుండా ఫైరింగ్ కు అనుకూలంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఈ క్రమంలోనే ఆయన సేవలను గుర్తించిన పోలీసు శాఖ ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా అప్పటి కలెక్టర్ అరుణ్ కుమార్ చేతుల మీదుగా 2024లో ఉత్తమ సేవా పథకం అందజేసింది.

### బదిలీపై వెళ్తున్న రమణకు సన్మానం..

ఏఎస్ఐ గా ఉత్తమ సేవలందించిన రమణ సాధారణ బదిలీల్లో భాగంగా గుడిబండ పోలీస్ స్టేషన్ కు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో బుక్కపట్నం పోలీసు స్టేషన్ లో రమణకు మండల ప్రజలు పోలీసులు ఘన సత్కారం చేశారు. అంకితభావంతో ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఏ ప్రాంతంలో విధుల్లోకి చేరినా మరింత బాధ్యతాయుతంగా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

## జాతికోసం తనవంతు సాయం వాల్మీకి రామాలయం కమిటీ సభ్యులు

బుక్కపట్నం మేజర్ న్యూస్ : బుక్కపట్నం మండల కేంద్రంలోని వాల్మీకి రామాలయంలో వినూత్న కార్యక్రమానికి రామాలయ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు వివరాల్లోకి వెళితే శ్రీ వాల్మీకి రామాలయం కమిటీ సభ్యులు జాతి మరియు వాల్మీకుల కోసం తన వంతు సాయం అనే కార్యక్రమం శ్రీకారం చుట్టారు బుక్కపట్నం గ్రామంలో ఎవరైతే వాల్మీకి కులస్తులు చనిపోతే వారికి అంత్యక్రియల కోసం తమ వంతు బాధ్యతగా 2000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తలమర్ల కుటుంబానికి చెందిన తలమర్ల శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం గ్రామంలోని తలారి చంద్రయుడు భార్య చనిపోవడంతో వాల్మీకి రామాలయం కమిటీ సభ్యులు వీరి హృదయాన్ని నివాళులర్పిస్తూ వారి కుటుంబానికి సంతాపం తెలియజేసి వారి అంత్యక్రియలు నిమిత్తం 2000 రూపాయలను అందజేశారు ఈ కార్యక్రమంలో వాల్మీకి రామాలయం అధ్యక్షులు గొర్ల రవికుమార్ వైస్ ప్రెసిడెంట్ అగ్రహారం కేశవ మాజీ అధ్యక్షులు గొర్ల కృష్ణ నీరు గుట్టు కేశప్ప గొర్ల మోహన రామకృష్ణ డ్రైవర్ రవి అంకె నాగరాజు కండక్టర్ అగ్రహారం బాబు మారుతి వార్త సాయికుమార్ ఇతర వాల్మీకి సోదరులు పాల్గొన్నారు



## సరికొత్త పరిజ్ఞానంతో గుండెలో బ్లడ్ క్లాట్స్ తొలగింపు

**- రాయలసీమలో తొలిసారిగా పెనంబ్రా కాట్ ఆర్ఎక్స్ వినియోగం**
**- 45 ఏళ్ల వయసున్న ఇద్దరు రోగులకు నయం చేసిన కిమ్స్ సవీరా వైద్యులు**
**- పూర్తిగా రక్తపు గడ్డలతో పూడుకుపోయిన స్థితిలో ఆస్పత్రికి వచ్చిన రోగులు**



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** గుండె రక్తనాళాలు పూర్తిగా రక్తపు గడ్డలతో పూడుకుపోయి, గుండెపోటు వచ్చిన 24 గంటల తర్వాత వచ్చిన ఇద్దరు రోగులకు కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు సరికొత్త, అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రాణదానం చేశారు. రాయలసీమతో ఈ సరికొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించి చికిత్స చేయడం ఇదే మొదటిసారి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.ప్రదీప్ కృష్ణ తెలిపారు. “గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాలకు చెందిన ఇద్దరు 45 సంవత్సరాల పురుషులు ఇటీవల మా ఆస్పత్రికి వచ్చారు. వారిలో ఒకరికి విపరీతంగా పొగతాగే అలవాటు ఉండగా, మరొకరికి కుటుంబంలో గుండెపోట్లు వచ్చిన చరిత్ర ఉంది. వారికి ఇద్దరికీ ముందుగా యాంజియోగ్రామ్ పరీక్ష చేసి చూశాం. ఇద్దరికీ కూడా గుండె రక్తనాళాలు పూర్తిగా రక్తపు గడ్డలతో పూడుకుపోయాయి. వాటికి సంప్రదాయ పద్ధతులలో చికిత్స చేయడం అస్సలు కుదరదు. దాంతో మేం పెనంబ్రా కాట్ ఆర్ఎక్స్ అనే సరికొత్త, అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చికిత్స చేశాం. ఇలా చేయడం ద్వారా ఒక రోగికి రక్తపు గడ్డలు తొలగించిన తర్వాత అసలు స్టెంట్ కూడా వేయాల్సిన అవసరం రాలేదు. ఆయనకు రక్తనాళంలో ఉన్న పూడిక పూర్తిగా తొలగిపోయింది. మరొక రోగికి మాత్రం రక్తపు గడ్డలు తొలగించిన తర్వాత 70శాతం బ్లాక్ ఉండడం వల్ల స్టెంట్ వేయాల్సి వచ్చింది. ఇద్దరూ పూర్తిగా కోలుకోవడంతో వారిని డిశ్చార్జి చేశాం. సాధారణంగా ఇలాంటి అత్యాధునిక పరికరాలను ఉపయోగించడం ఈ ప్రాంతంలో చాలా అరుదుగా ఉంటోంది. గతంలో వేరే అవయవాలకు సంబంధించి ఇలాంటి చికిత్సలు చేసినా, గుండె రక్తనాళాల పూడికకు చేయడం రాయలసీమలోనే ఇదే మొదటిసారి. పెనంబ్రా కాట్ ఆర్ఎక్స్ పరికరాన్ని ఉపయోగించి చికిత్స చేయడం ఇప్పటివరకు బెంగళూరు, హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద నగరాల్లోనే ఉంది. రాయలసీమ వాసులు ఇప్పుడు ఇలాంటి సమస్యలకు అక్కడివరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చి, ఇక్కడున్న నిపుణుల సాయంతో అత్యాధునిక వైద్యం పొందొచ్చు” అని కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.ప్రదీప్ కృష్ణ వివరించారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు : ఎంపీపీ



ముదిగుబ్బ, మేజర్ న్యూస్ : నానాటికి పెరుగుతున్న పట్టణ జనాభా నీటి అవసరాలు శాశ్వతంగా పరిష్కరించడానికి మండలంలో వేసవిలో తల ఎత్తే తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని, వీటిపై ప్రత్యేక నివేదిక రూపొందించి అందించాలని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఎంపీపీ చాంబర్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ పట్టణ ప్రజల నీటి అవసరాలు తీర్చుడా నికి సరి అయిన వనరులు, వసతులు ఉన్న సక్రమంగా నీరందక పోవడంతో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని, ప్రజల నీటి అవసరాలు తీర్చుడానికి చేపట్టా ల్సిన చర్యల గురించి అధికారులు ప్రణా ళికలు రూపొందిం చాలన్నారు. అలాగే వేసవిలో నీటి ఎద్దడి నెల కొనకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీరు అందించాలన్న పథకాన్ని ప్రతిష్టా త్మకంగా చేపట్టిందని దానిని మండలంలో సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో ప్రజల నీటి అవసరాలు తీర్చుడానికి మంచినీటి పథకాల బోర్లు, చేతిపంపులు ఏర్పాటు చేయడం జరిగిందని,నిత్యం పట్టణ ప్రజల నీటి అవసరాలు తీర్చుడానికి సత్యసాయి రక్షిత మంచినీటి పథకం, ఉప్పలపాడు 16 గ్రామాల మంచి నీటి పథకం ద్వారా పట్టణానికి నీటి సరఫరా చేపట్టడం జరిగింది. సత్య సాయి రక్షిత మంచినీటి పథకం ద్వారా పార్లపల్లి రిజర్వాయర్ నుంచి మండల పరిధిలోని సుమారు 30 గ్రామాలకు, మండల కేంద్రానికి చాలి నంత మేర నీటి సరఫరా చేయడం జరుగుతోందని, విద్యుత్ సరఫరా లో అంతరాయాలు, లో వోల్టేజీ, హై వోల్టేజి కారణంగా విద్యుత్ మోటార్లు మరమ్మత్తులకు గురి అవుతున్నాయని తద్వారా సక్రమంగా మీరంద లేఖ పోతోందని ఆర్డబ్ల్యూఎస్, సత్య సాయి అధికారులు సిబ్బంది ఎంపీపీ దృష్టికి తీసుకొని వచ్చారు. అలాగే నీటి సరఫరా నిమిత్తం అదరపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని వారు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. నీటి సరఫరాకు అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తొలగించడం, ఓల్టేజి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టడానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, విద్యుత్ మోటార్లు మరమ్మత్తు లకు గురైన మండల, పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. నీటి సమస్య పరిష్కారానికి మండల వ్యాప్తంగా ను, మండల కేంద్రంలోనూ పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చుడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో నీటి యొద్దని నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవా లని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యమైన ప్రతి ఇంటికి తాగునీరు అందేలా యుద్ధ ప్రతిపాదిగల చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి దివాకర్, ఆర్డబ్ల్యూస్ ఏఈ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ మంజుల, ఇంజనీరింగ్ ఏఈ వినోద్, సత్య సాయి రక్షిత మంచినీటి పథకం, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

## 132 టెట్రా ప్యాకెట్ల కర్నాటక మద్యం పట్టివేత..

రాయదుర్గం, మేజర్ న్యూస్: మండల పరిధిలోని 74 ఉడేగోళం వద్ద బుధవారం నిర్వహించిన దాడులలో 192 టెట్రాపాకెట్ల కర్నాటక మద్యం పట్టుకున్నట్లు రాయదుర్గం ఎక్సైజ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. ఈ వివరాలను ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో మీడియాకు వెల్లడించారు. కర్నాటకలో తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఆంధ్రాలో ఎక్కువ ధరకు అమ్ముకుని లాభం గడించే క్రమంలో గుమ్మగట్ట మండలం కేపీ దొడ్డి గ్రామానికి చెందిన సోమశేఖర్ తన ద్విచక్రవా హనంలో టెట్రాపాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. రాయదుర్గం ఎక్సైజ్ పరిధిలో ఎవరైనా కర్నాటక మద్యం అక్రమ రవాణా చేసినా, కలిగి ఉన్నా, కొనుగోలు చేసినా కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్ఐ పవన్ కుమార్ , టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# రేషన్ షాపులలో అక్రమాలు

### పట్టించుకోని అధికారులు

### అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్



**రాయదుర్గం, మేజర్ న్యూస్:** రాయదుర్గం పట్టణంలోని రేషన్ షాపులలో అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని , అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సీపీఎం నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయడంలో పట్టణంలో ఉన్నటువంటి రేషన్ షాప్ డీలర్లు పూర్తిగా విఫలం చెందుతున్నారని, అంతేకాకుండా డీలర్లు ఎవ్వరు కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ యొక్క నియమ నిబంధనలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నటువంటి బియ్యాన్ని డబ్బాలతో తూకం చేసి ఇవ్వకూడదని జిల్లా కలెక్టర్ గారు అనేకసార్లు చెప్పినా డీలర్లు మాత్రం కలెక్టర్ గారి ఆదేశాలను, ప్రజా పంపిణీ వ్యవస్థ యొక్క నియమ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ప్రజల ను తీవ్రంగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. డబ్బాలు పెట్టి తూకాలు వేయడం వల్ల 15 కేజీలకు మూడు కేజీలు, 20 కేజీలకు నాలుగు కేజీలు, 35 కేజీలకు ఐదు కేజీల వరకు తక్కువ బియ్యం వేస్తున్నారని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలియజేశారు. మరి తూకాలలో ప్రజలను మోసం చేసి మిగిల్చుకున్న బియ్యాన్ని అక్రమమార్గాల్లో అమ్ముకొని డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్లు ఇంత నిర్లక్ష్యంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టి పట్టినట్లుగా వ్యవహరించడం ఎంత మేరకు సమంజసం అని ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తామని, ఎక్కడైనా డీలర్లు ప్రజలకు తూకాలలో మోసం చేస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడితే వారిపై తక్షణమే చర్యలు తీసుకొని వారి డీలర్ షిప్ లను రద్దు చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం దీనిని అమలు చేయడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని అన్నారు. స్వయాన మంత్రిగారే ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలు జరుగుతుందా లేదా అని తెలుసుకోవడం కోసం రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారని, కానీ ఇక్కడి రెవెన్యూ అధికారులు మాత్రం ఒక్క రేషన్ షాప్ ను కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఇదే అదునుగా చేసుకున్న డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దీనిని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసే బాధ్యతతో కనీసం రెండు నెలలకు ఒకసారి అయినా రేషన్ షాపులను తనిఖీలు చేయాలని, అదేవిధంగా ఇలాంటి అక్రమాలు, మోసాలు జరగకుండా ఉండాలంటే అన్ని రాజకీయ పార్టీలతో కలిపి గతంలో మాదిరిగా రెండు నెలలకు ఒకసారి అయినా ఫుడ్ కమిటీ సమావేశాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రేషన్ షాపు డీలర్లు చేస్తున్నటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యులు తిమ్మరాజు, మధు, రమేష్, అంజి, శంకర్ ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల సముదాయాల సమావేశాల వేళల్లో మార్పు చేయాలి..

### ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని.పాతిరెడ్డి



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** పాఠశాలల సముదాయాల సమావేశ సమయం వేళల్లో మార్పు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు అయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11:45 నిమిషాల వరకు పనిచేస్తున్న పాఠశాలలో తరగతులు నిర్వహించి, తర్వాత దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు ఒక గంటలో చేరుకోవడం సాధ్యమేనా ? కొన్ని సందర్భాలలో ఉపాధ్యాయులు రెండు వాహనాలు మారి గమ్యస్థానం చేరుకోవాలి. రెండు వాహనాలు మారి క్లస్టర్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు గంటలో రెండు వాహనాలు అందుబాటులో ఉంటాయా. పంచాయతీ వారిగా క్లస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల కొన్ని పాఠశాలలు క్లస్టర్ కి చేరుకోవడానికి దూరంగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయాల్సి ఉంటుంది, మరి భోజనం ఎప్పుడు చేయాలి. కనీసం భోజనానికి అరగంట సమయం కేటాయించ కపోతే ఎలా. ఈ తొందరలో ఉపాధ్యాయులకు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అదేవిధంగా పాఠశాలల పనివేలలు సాయంత్రం నాలుగు గంటల వరకే కావున ఆ సమయానికే సమావేశాలు ముగింపు చేయాలని, ఉన్నతాధికారులు ఆలోచించి తగు నిర్ణయం తీసుకుని క్లస్టర్ సమావేశాలు సౌకర్యవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గౌని. పాతిరెడ్డి డిమాండ్ చేశారు.

# మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి

### క్వింటా రూ.50వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

### ఏపి రైతు సంఘం డిమాండ్



**కూడేరు, మేజర్ న్యూస్ :** కూడేరు మండలం ముద్దలాపురం గ్రామంలో మిరప సాగు చేసి నష్టపోయిన రైతులను రైతు సంఘం బృందం బుధవారం పర్యటించి పరిశీలించి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా మిరపకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రోజు రోజుకు ధర పడిపోతున్నడంతో గత రెండు సంవత్సరాలుగా ఏసీ గోడౌన్ లో మిరప పంట నిల్వ చేసుకోవడం జరిగింది. కనీసం ఏసీ కూడా బాడుగ చెల్లించడానికి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు ఇప్పటివరకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కూడా ప్రకటించకుండా రైతులను మోసం చేస్తున్నది, ప్రధానంగా ఎగుమతులు చేయడానికి అనుమతులు లేకపోవడంతో వ్యాపారులు కొనుగోలు చేయడానికి కూడా రాకుండా ఉన్నారు గత మూడు సంవత్సరాల ముందు 60 నుండి లక్ష రూపాయలు పలికిన ధర ప్రస్తుతం 20 వేల నుంచి 22 వేలు మాత్రమే పోవడంతో రైతుల గోడౌన్ లలో నిలువ చేసుకుంటున్న పరిస్థితి దీనివల్ల రైతులు అప్పుల పాలు అవుతున్న పరిస్థితి ఉన్నది. ఈ సంవత్సరం అతివృష్టి అనావృష్టి వల్ల మిరప పంట పూర్తిగా దెబ్బతిని ఎకరాకు 30 క్వింటాలు దిగుబడి రావాల్సి వుండగా 5 క్వింటాళ్లు రావడంతో పెట్టుబడులుకు తెచ్చిన అప్పులు ఎలా కట్టాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో మిరప రైతులు ఉన్నారు. కావున ప్రభుత్వం జోక్యం చేసుకొని మిరప పంటను క్వింటాల్ 50 వేల తో ప్రభుత్వం కొనుగోలు చేయాలి నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు పంట నష్ట పరిహారం ఇచ్చి గత రెండు సంవత్సరాలుగా గిట్టుబాటు ధర లేక ఏసీ గోడౌన్ లో మిరప నిలువ చేసుకున్న బాడుగలను ప్రభుత్వమే చెల్లించి మిరప రైతులను ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కరీం, రైతు సంఘం నాయకులు ఈరప్ప, వెంకటేశు, నారాయణరెడ్డి, మల్లికార్జున, రైతులు చిన్న ఆంజనేయులు, నరేష్, బాలరాజు, నాగరాజు, రామాంజి, వెంకట లక్ష్మమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పక్కాగా నిర్వహించండి



**పామిడి, మేజర్ న్యూస్ :** మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ పేర్కొన్నారు. మండలంలోని కాళాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. భూముల కొలతలు, రికార్డుల క్రమబద్ధీకరణ పక్కాగా ఉండాలన్నారు. రైతులకు అర్థమయ్యేలా మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఆర్ఏ విజయ్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిగిలో అంబేద్కర్ భవనం స్థలం పరిశీలన

**పరిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన గతంలో నిర్మించిన ఎస్సీ హాస్టల్ నూ అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయడం కోసం బుధవారం మండల వ్యాప్తంగా ఉన్న దళిత సోదరులు స్థలం పరిశీలన చేసి కంప చెట్లను తొలగించి శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ మహనీయుల జాబితాలో ముందుండే జాతీయ నాయకుడు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్. ఆయన ఆలోచనలు ఆదర్శాలు నేటి తరానికే కాక భవిష్యత్ తరాలకు కూడా స్పూర్తిదాయకం అని ఈ సందర్భంగా తెలిపారు

# నేడు విద్యుత్ అంతరాయం

**హిందూపురం మేజర్ న్యూస్ :-** స్థానిక పట్టణంలోని రైల్వే రోడ్ లో గురువారం పల్లా లాడ్జ్ నుండి నంది సర్కిల్ వరకు విద్యుత్ టవర్ల నిర్మాణం, 11 కేవి లైన్ స్ట్రింగింగ్ వర్క్ కారణంగా విద్యుత్ సరఫరాలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని కావున వినియోగదారుల సహకరించాలని విద్యుత్ శాఖ వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

# పాఠశాలలు - సముదాయాల నిర్వహణ ఒకే రోజు నిర్వహించడాన్ని మార్చాలి..

### డీఈఓ కి ఏపీటిఎఫ్ వినతి..



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విద్యాశాఖ విడుదల చేసిన పాఠశాల సముదాయాల సమావేశం నిర్వహణ ఒక్క రోజులోనే పాఠశాల విధులు అర్ధ రోజు అక్కడి నుండి వచ్చి పాఠశాల సముదాయ సమావేశ నిర్వహణ అర్ధ రోజు లోనే నిర్వహించాలి అనే విధానం అశాస్త్రీయంగా అసంబద్ధంగా ఉందని ఈ నిర్ణయాన్ని ఏపిటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తూ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు కి అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. జిల్లా శాఖ అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్ సిరాజుద్దీన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి నర్సింహులు మాట్లాడుతూ.. పాఠశాలలు కొంత సమయం మాత్రమే నిర్వహించాలని ఆ సమయంలోనే తరగతుల నిర్వహణ,మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పంపిణీ చేసిన అనంతరం 20 నుండీ 25 కి.మీ దూరంలో ఉన్న పాఠశాల సముదాయంలో నిర్వహించే సమావేశంలో పాల్గొనాలనడం అత్యంత అశాస్త్రీయమైన విధానం. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల నుండి ఉన్నత పాఠశాలలకు వచ్చేటువంటి విద్యార్థులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తూ.. వచ్చి ఉంటారు. వారు తిరిగి మధ్యాహ్నం ఇంటికి వెళ్లాలంటే ఆ సమయానికి బస్సులు కూడా ఉండవు అలాంటి వారు తిరిగి గ్రామాలు చేరుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి అపాయాలు జరిగే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందని, అర్ధ రోజులో పాఠశాల ముగిస్తే దీనివల్ల విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అర్ధ రోజుల్లో పాఠశాల ముగించడం అదే అర్ధ రోజులో పాఠశాల సముదాయాలు ముగించడం సరికాదు కావున రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. వివిధ క్యాడరులలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు వందలాది మందికి అందరికీ ఒకే చోట సమావేశం నిర్వహించడం కూడా వాస్తవంగా సౌకర్యవంతంగా ఉండదని...అదేవిధంగా ఎస్ జి టి ,భాషా సహాయకులు, విషయ సహాయకులకు అందరికీ ఒకే విధమైన శిక్షణ ఇవ్వడం సరికాదన్నారు. శిక్షణా కార్యక్రమాలు మెరుగైన విధంగా ఉండాలంటే పూర్తి స్థాయిలో ఇవ్వాలని భావిస్తే ఒకరోజు పూర్తిగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలల నిర్వహణ అనంతరం హాజరు కావాలంటే మొదటగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు ఒకవైపు,మరీ ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు రోజంతా ప్రయాణం, సమావేశంలో పాల్గొనడం అంటే దాదాపు గంటల సమయం వారి ఆరోగ్య పరిస్థితి సహకరించదని ఉత్తర్వులు జారీ చేయడంలో ఈ అంశాలపై దృష్టి సారించలేదని ఉత్తర్వులు పునః సమీక్షించి పూర్తి రోజు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్ ఎస్ సి రాజుద్దీన్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి జిల్లా నాయకులు చిదంబ రెడ్డి జిఓ కమిటీ కన్వీనర్ బాల రామ్మోహన్ సూర్యనారాయణ ఈశ్వరయ్య తిప్పేస్వామి మహేష్ రంగనాయకులు శ్యామ్ శంకర్ జాకబ్ సుహేల్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానం చేద్దాం...

### అఖిల భారత టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ నెగిటివ్ రక్తం అవసరమై శస్త్ర చికిత్స రక్తం అవసరం ఉందని గోని మేకల పల్లి నారాయణప్ప ఇబ్బంది పడుతుంటే ఈ విషయం టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం వ్యవస్థాపకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ను బాధితులు సంప్రదించగా టిప్పు సుల్తాన్ రక్తదాన సంఘం ఉపాధ్యక్షులు తిరుమలేష్‌ను సంప్రదించి రక్తదానం చేశారు. ఇప్పటికే దాదాపు 30సార్లు రక్తదానం చేసి బాధితులకు తిరుమలేష్ సహకారం అందించారనీ ఉమర్ ఫారుక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, యాకూబ్, జహూర్, ఆయుర్వేద వైద్యులు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గోవిందా..గోవింద నామస్మరణతో మార్మోగిన వెంకటేశ్వర స్వామి రథోత్సవం



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం పట్టణంలో వెలసినటువంటి శ్రీ పేట వెంకటరమణ స్వామి దేవస్థానంలోశ్రీ వారి బ్రహ్మ రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తాదుల నడుమ గోవిందా గోవింద నామస్మరణతో రథోత్సవం నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవలు, అభిషేకాలు, ప్రాకారోత్సవం, సహస్ర దీపాలంకరణ, స్వామి వారి కళ్యాణోత్సవం అదేవిధంగా రథోత్సవం నగరోత్సవకార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తాదుల నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ రథోత్సవం తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి కర్ణాటక నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి పలువురు సేవా కార్యక్రమాలు అన్నదాన ప్రసాదాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ బాలాజీ, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, లేపాక్షి ఆలయ చైర్మన్ రమానంద శర్మ, బేవనహళ్లి ఆనంద్, ఆలయ కమిటీ చైర్మన్, ఈవో నరసింహమూర్తి, పలువురు కౌన్సిలర్లు, పార్టీలకు అతీతంగా నాయకులు, పలువురు ప్రముఖులు, కర్ణాటక, తమిళనాడు, నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

## బెల్లం నరేష్ వైసీపీ నాయకులు కాదు

### – వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకంఠపురానికి చెందిన బెల్లం నరేష్ రెండు, మూడు రోజుల క్రితం తన వ్యక్తిగత కారణాలు, వేరే ఇతరత్రా సమస్యల దృష్ట్యా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని దేవుడి దయ వల్ల అతడు ప్రాణాలతో బయట పడ్డారని ఈ సందర్భంగా వైసీపీ సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ బెల్లం నరేష్ ఎన్నికల ముందు మా పార్టీకి చెందిన వ్యక్తే అయితే మేము ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇక్కడికి వచ్చిన తర్వాత మా సారథ్యంలో బెల్లం నరేష్ కు హిందూపురం టౌన్ బి-బ్లాక్ కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించామనీ కేవలం మూడు నెలలు పార్టీకి పని చేశారు. ఆయన వ్యక్తిగత కారణాలతో పార్టీకి దూరంగా ఉంటూ, 2024 ఎన్నికల్లో స్వాతంత్ర అభ్యర్థి కోసం పని చేశారని అతనికి వైసిపి ఎటువంటి సంబంధం లేదు. కొన్ని మీడియా చానల్స్ లో బెల్లం నరేష్ వైసిపి నాయకుడు ఆత్మహత్యాయత్నం అని ప్రసారం చేసిన వాటిని ఖండిస్తున్నామన్నారు. అందువలన వివరణ ఇవ్వడం కోసం పత్రికా ప్రకటన ద్వారా తెలియ చేస్తున్నామని ఆమె తెలిపారు.




# అందుబాటులో లేని 108 వాహనాలు..

### – ఇబ్బందులు పడుతున్న ప్రజలు..




పుట్టపర్తి మేజర్ న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి తో పాటు సమీపంలో కల బుక్కపట్నంలో 108 వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి ప్రమాదాలకు గురవుతున్న వారు, గర్భవతులు తో పాటు ఇతరులు అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రులకు వెళ్లాలంటే 108 వాహనం అందుబాటులో ఉండటం లేదు. జిల్లా కేంద్రంలోని 108 వాహనం తరచు బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతుండడంతో ఈ ప్రాంతంలో ఆకస్మికంగా జరిగే ప్రమాదాలలో గాయపడే వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి వాహనాలు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు. పుట్టపర్తి వాహనం అనంతపురం వైపు వెళ్లినప్పుడు ప్రమాదాలు జరిగితే ఆ వాహనం రావడానికి గంటల సమయం తీసుకుంటుంది. ఈ మధ్యలో ప్రమాదాలలో గాయపడిన వారు ప్రైవేట్ వాహనాల ద్వారా ఆసుపత్రులకు వెళుతున్నారు. అదేవిధంగా బుక్కపట్నం మండలానికి చెందిన 108 వాహనాన్ని పాముదుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంచుతున్నారు. ఈ వాహనానికి వెళ్లే డ్రైవర్లు ఇతర సిబ్బంది సమీప గ్రామాలకు చెందిన వారు కావడంతో తమకు అనుకూలంగా ఉంటుందని భావించి అధికారుల ద్వారా వాహనాన్ని పాముదుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంచేలా చూసుకుంటున్నారు. మండల కేంద్రమైన బుక్కపట్నం గ్రామంతో పాటు సమీప ప్రాంతాలలో ఏవైనా ప్రమాదాలు జరిగితే పాముదుర్తి నుంచి వాహనం రావడానికి చాలా సమయం తీసుకుంటుంది. వాహనం రావడం ఆలస్యం అవుతుండడంతో 108 సేవలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి నాలుగు కిలోమీటర్ల దూరంలో కల బుక్కపట్నం లో 108 వాహనం ఉంచాల్సి ఉండ గా, మండల కేంద్రానికి 22 కిలోమీటర్ల దూరంలో వాహనాన్ని ఉంచుతున్నారు. కదిరి డివిజన్ పరిధిలో బుక్కపట్నం మండలాన్ని చేర్చడంతో 108 వాహనం ఈ ప్రాంత వాసులకు అందుబాటులో లేకుండా పోతుంది. ఈ వాహనం పుట్టపర్తి డివిజన్ లో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిస్ట్రిక్ట్ మేనేజర్ అబ్దుల్ మాట్లాడుతూ గతంలో పాముదుర్తి నుంచి బుక్కపట్నం వైపు రహదారి సక్రమంగా లేకపోవడంతో వాహనాన్ని పాముదుర్తి లో ఉంచడం జరిగిందని, ప్రస్తుతం రహదారి నూతనంగా నిర్మితమైనందున వాహనం బుక్కపట్నంలో ఉంచడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నగరంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని కమలానగర్ లో చంద్రశేఖర్ అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.



సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

## రస్తా కోసం పచ్చని పొలం ధ్వంసం



నార్పల,మేజర్ న్యూస్ : నార్పల మండలం గంగన పల్లి గ్రామంలో రస్తా విషయంలో రైతు పత్తిపాటి రామాంజనేయులకు చెందిన బీర తోటను కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేశారు. రస్తా వదలాలని చెప్పి పచ్చని పొలాన్ని జెసిబి తో ధ్వంసం చేసి, డ్రిప్పు పరికరాలను ధ్వంసం చేశారు. దాదాపు మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుండి పంపించేశారు. రైతు పత్తిపాటి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మార్కెట్ కమిటీకి 48.20 క్వింటాళ్ల చింతపండు

రాయదుర్గం, మేజర్ న్యూస్: రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కు రెండవ వారమైన బుధవారం 48.20 కింటాళ్ల చింతపండును రైతులు మార్కెట్ కు తెచ్చినట్లు మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో 21 లాట్ల ఫ్లవర్ రకం, 3 లాట్ల కరిపుళి రకం మొత్తం 24 లాట్ల చింతపండు వ్యాపారాలు జరిగాయని ఆయన తెలిపారు. ఫ్లవర్ రకం కనిష్ఠంగా రూ. 8,100 నుండి రూ. 11,700 వరకు ధర పలికి, గత వారం కంటే ధర కొంతమేర పెరిగినట్లు ఆయన తెలిపారు. కరిపుళి రకం కూడా కనిష్ఠంగా రూ. 19వేల నుండి రూ. 20,400 వరకు టెండర్లు జరిగాయని తెలిపారు. అధిక మొత్తంలో రాయదుర్గం మార్కెట్ కమిటీకి చింతపండు తీసుకురావాలని కమిటీ సెక్రెటరీ రైతులను కోరారు.



## విస్తృతంగా వాహనాల తనిఖీలు




తాడిపత్రి మేజర్ న్యూస్: తాడిపత్రి రూరల్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా తాడిపత్రి రూరల్ పరిధిలో పలుచోట్ల రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా వాహనదారులకు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూ రెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులలు సక్రమంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే వాహనాలను స్టేషన్ కు తరలిస్తామని హెచ్చరించారు.

## యాగశాల పనులు ప్రారంభం

తాడిపత్రి మేజర్ న్యూస్: తాడిపత్రి పట్టణంలో అతి పురాతనమైన శ్రీ బుగ్గ రామలింగేశ్వం స్వామి క్షేత్రంలో బ్రహ్మో త్సవాలకు యాగశాల పనులను బుధవారం చేపట్టారు. ఆలయ అర్చకులు గిరిస్వామి అత్యంత భక్తిశ్రద్ధల నడుమ పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి యాగ శాల పనులను ప్రారంభించారు. ఈనెల 20 నుంచి శ్రీ బుగ్గ రామ లింగేశ్వర స్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్స వాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.



## బి.లక్ష్మికి డాక్టరేట్ ప్రదానం..



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం ఫార్మా సిటికల్ సైన్సస్ విభాగంలో సుదీర్ఘ పరిశోధనలో భాగంగా అనంతపురం జేఎన్టీయూ యూనివర్సిటీ బి. శ్రీలక్ష్మి కి డాక్టరేట్ ప్రధాన చేశారు. జేఎన్టీయూఏ అనుబంధ కళాశాల రైపర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ పి. రామలింగం పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ అఫ్ టినోస్పోరా కోర్డిఫోలా ఫర్ ఇట్స్ యాంటి క్యాన్సర్ అండ్ ఏంటిట్యూ బర్క్యులోసిస్ ఆక్టివిటీ అనే అంశంపై పరిశోధన చేసిన బి. శ్రీలక్ష్మి కి సదరు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. పరిశోధక విద్యార్థి బి. శ్రీలక్ష్మి అనంతపురం జిల్లా, కొత్తచెరువు వాసి. ఈమె ఎస్కేయూ మాజీ ప్రొఫిసర్, మాజీ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ బి.వెంకటప్ప కుమార్తె, ఈమె టినోస్పోరా కార్డి ఫోలియా మొక్కలో మానవాళికి ఉపయోగపడే చాల ఔషధ గుణాలున్నాయని, దీనిని సాధారణంగా తిప్పతీగా అని పిలుస్తారు. తిప్ప తీగలో ఫ్రీ రాడికల్స్ తో పోరాడే యాంటి ఆక్సి డెంట్స్ ఎక్కువగా ఉంటాయని, ఈ మొక్క ముఖ్యంగా టైప్ 2 మధుమోహం తగ్గేందుకు ఉపయోగిస్తారు. కీళ్ల వ్యాధులను తగ్గించే గుణాలు తిప్పతీగా లో చాలా ఉన్నాయని, తిప్ప తీగ క్యాన్సర్ వ్యాధి నిరోధకంగా చాల బగా పనిచేస్తుందని, ఇన్ని ఔషధ గుణాలున్న ఈమొక్కను ఆయుర్వేదాలలో అమృత అని పిలుస్తారు అందువలన శ్రీలక్ష్మి ఈ మొక్కపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన బి. శ్రీలక్ష్మి ని అభినందించారు.

## విద్యుత్ ఏఈ సురేంద్ర బాధ్యతల స్వీకరణ



నల్లచెరువు ,మేజర్ న్యూస్ : నల్లచెరువు మండల నూతన విద్యుత్ ఏఈ అధికారిగా సురేంద్ర బుధవారం స్వీకరించారు. మండల విద్యుత్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దుశ్యాలు వలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. నూతన ఏ ఈ సురేంద్ర మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతన్నలకు సామాన్య ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా ల ఆదేశాల మేరకు ప్రజలకు విద్యుత్ సేవలు అందించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. లైన్మెన్లు విద్యా సాగర్ రెడ్డి, జనార్ధన, కిష్ట, సిబ్బంది హరి, రాజశేఖర్ రెడ్డి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు క్రికెట్ కిట్టు పంపిణీ



పామిడి, మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ సాయి హాస్పిటల్ అధినేత, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ జర్నలిస్టులకు బుధవారం క్రికెట్ కిట్టు పంపిణీ చేశారు. జర్నలిస్టులో క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్లో పామిడి టీమ్ ప్రతిభ కనపరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విలేకరులు తదిత రులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా.. వ్యక్తికి గాయాలు

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని చెరువు కట్ట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో బుక్కరాయసముద్రం మండలం నీలం పల్లి గ్రామానికి చెందిన షేక్ష వలి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.







# ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరుబాట

- వైసిపి అనంతపురం అధ్యక్షులు వై .అనంత వెంకటరామి రెడ్డి
- కూటమి ప్రభుత్వ అరాచకాలపై నిత్య పోరాటాలు - వైఎస్ఆర్ సిపి నేత ఆలూరి సాంబశివరెడ్డి
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని హామీల నుంచి జారుకునేందుకు చంద్రబాబు యత్నం
- వైఎస్ఆర్సిపి నాయకులు, మాజీ మంత్రి సాకే శైలజనాథ్



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో పోరు బాట సాగిస్తామని ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు వై. అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. బుధవారం వైసీపీ అనంతపురం జిల్లా కార్యాలయంలో ఆయన వైసిపి రాష్ట్ర నాయకులు ఆలూరు సాంబ శివరెడ్డి, సింగనమల వైసిపి ఇన్చార్జ్ వీరాంజనేయులు, పార్టీలో నూతనంగా చేరిన మాజీ మంత్రి శైలజ నాథ్ తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా శైలజనాథ్ నాయ కత్వంలో కాంగ్రెస్ పార్టీ నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి వైసీపీలో చేరారు. అనంత వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు, ఆంధ్ర ప్రజల జీవనాడీ అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే నీటి నిల్వ తగ్గిపోయి రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల నిర్వహణలో చంద్రబాబు సర్కార్ విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజల గొంతుకను అణచివేసేందుకు పోలీసులను ఉపయోగించుకుంటూ వైసిపి నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పెద్దలు కక్షసాధింపు చర్యలు మానుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నేత, ప్రభుత్వ విద్యా మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయత కు మారుపేరు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్ కే దక్కుతుందన్నారు. హామీల అమలులో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు చిత్తశుద్ధి లేదనీ,వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ కూటమి అరాచకాలపై నిత్యం పోరాటాలు చేస్తూనే ఉంటామని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ మాట్లాడుతూ హామీల అమలు కు పవన్ కళ్యాణ్ ఎందుకు బాధ్యత తీసుకోరు? అధికారం ఏర్పడి ఏడు నెలలకు కావాల్సిన ఎందుకు కాలయాపన చేస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటున్న పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేయరా? ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందనీ, ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ చంద్రబాబు జారుకునే యత్నం చేస్తున్నారని శైలజనాథ్ పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు కు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియలేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్ సిక్స్ హామీల అమలు కోసం వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నేతృతంలో ఐక్యతగా కలిసికట్టుగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



తనకల్లు, మేజర్ న్యూస్ :భూములను కౌలుకు చేస్తున్న ప్రతి రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని బుధవారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ ఐ మల్లి కార్జున రావు కు అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకోవడంతో కౌలు రైతులు గణనీయమైన సంఖ్యలో పంటలు పండిస్తున్నారు. అన్ని పంటల్లోనూ అన్ని ప్రాంతాలలోనూ రోజు రోజుకు విస్తరిస్తున్నారు. మన రాష్ట్రం లో వ్యవసాయమంటే కౌలు రైతుల వ్యవసాయమేనని, వాణిజ్య ఆహార ఉద్యానవన పంటలు పండించడం లో ముందు వరుసలో ఉన్నారన్నారు. కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు బ్యాంకు రుణాలు అందటం లేదు కనీసం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కావాలన్నా భూ యజమాను ల ప్రమేయం లేనిది గుర్తింపు కార్డులు కూడా దక్కటం లేదు కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరువులు బ్యాంకు రుణాలు దొరక్క ప్రైవేటు వ్యక్తుల ద్వారా వడ్డీకి తెచ్చుకొని పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక అప్పుల్లో కూరుకు పోతున్నార న్నారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండా వాస్తవ సాగుదారులకు గుర్తించి వారికి కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణాలు చేయాలి, కౌలు రైతుల ను గ్రూపులు ఏర్పాటు చేసి వడ్డీ రాయితీ పంట రుణాలు అందించాలి,అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందించాలి. కౌలు రైతులు పండిస్తున్న అన్ని పంటలకు బీమా పథకాన్ని వర్తింపజేయాలి ప్రీమియం మొత్తాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలి, ప్రకృతి విపత్తు ,చీడ, పీడలు సంబంధించి పంటలు దెబ్బతిన్న సందర్భాలలో భీమా పరిహారం ఇన్పుట్ సబ్సిడీ కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇక్బాల్, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్ప, నాయకులు రామన్న, వేమన్న, రమణ, శివ, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

### – ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి రెడ్డి

తాడిపత్రి మేజర్ న్యూస్: గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కార మార్గాలు చూపించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు.తాడిపత్రి మండల పులిప్రోదుటూరు, గంగాదేవిపల్లి, ఈగుడూరు గ్రామాల్లో బుధవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి ప్రొద్దుటూరు గ్రామంలో ముఖాముఖిగా మాట్లాడి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన సర్వత్రమే సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పొలిమేర మురళీమోహన్ రెడ్డి, పొలిమేర నారాయణరెడ్డి, పల్లె జగదీశ్వర్ రెడ్డి, పులి మేర రామ్మోహన్ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీ భద్రతే.. మా బాధ్యత

### – ట్రాఫిక్ పై ప్రజలకు అవగాహన

కదిరి, మేజర్ న్యూస్ :మీ భద్రతే..మా బాధ్యత అని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కదిరి పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం కదిరి పట్టణంలో మదనపల్లి లోని ఎంఐ టిఎస్ కళాశాలకు చెందిన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగుదల, వాహన రాకపోకలు అధికమ వడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుం దని సిఐ వివరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే సమస్య లేకుండా వాహన రాకపోకలు సాగించవచ్చని సూచించారు. పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని, ద్విచక్ర వాహనదారుడు లైసెన్స్ తో పాటు వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఆటో, ఫోర్ వీలర్ వాహనదారులు వాహన రికార్డులతో ఉంచుకోవాలన్నారు. అలాగే వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆపకూడదని సూచించారు. లేనిపక్షంలో జరిమా నాలు విధిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ బాబ్జాన్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సిడబ్ల్యూసి సభ్యుడు రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలు

కదిరి, మేజర్ న్యూస్: మాజీ మంత్రి, సి డబ్ల్యూ సి సభ్యులు రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కదిరి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం కాంగ్రెస్ బీసీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నచ్చు బాలకృష్ణ యాదవ్ మాట్లాడు తూ రఘువీరా రెడ్డి విద్యార్థి దశ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచ లంచెలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదా లలో పనిచేసి విభజిత ఆంధ్రప్రదేశ్ కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు నిగా, ప్రస్తుతం సి డబ్ల్యూ సి సభ్యులుగా గల్లీ నుంచి ఢిల్లీ దాకా రాజకీయం చేసిన రఘువీరుడుగా,

అపార భగీరథుడు వలే కృష్ణా జలాలను కరువు నేలపై పారించిన సామాన్యం గా కనిపించే అసమా న్యుడు , అపార రాజకీయ చాణుక్యు డు 4 పర్యాయాలు ఎమ్మెల్యే గా, 3సార్లు మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసా య, రెవెన్యూ వంటి కీలక శాఖలకు మంత్రిగా రాష్ట్ర ప్రజలకు , కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించిన నాయక త్వం అనేక మందికి స్ఫూర్తిదాయకం, ఎంతో మంది నాయ కులను తయారు చేసి వారికి జీవితాన్ని ఇచ్చిన గొప్ప లీడర్ అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ పట్టణ అధ్యక్షులు ఖదాబకష్ అష్రఫ్ , ఇర్ఫాన్, భార్గవ, చంద్ర, రాఘవ తదిత రులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నాయకుడు శ్రీరామ్ రెడ్డి జన్మదిన వేడుకలు

బుక్కరాయసముద్రం మేజర్ న్యూస్ : మండల పరిధిలోని సిద్దరాంపురం టిడిపి సీనియర్ నాయకుడు, మాతా ఫుడ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పసుపుల శ్రీరామ్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆయన స్వగృహంలో జన్మదిన వేడుకలకు సింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



### పది ఎకరాలు ఉన్న రైతుకు కూడా

# డ్రిప్పు, స్ప్రింక్లర్లు వచ్చేలా చూస్తాం

### – రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ
### – మూడు మండలాల రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు పంపిణీ





**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా వంటి కరవు ప్రాంతంలో రైతులకు డ్రిప్పు స్ప్రింక్లర్లు ఎంతో అవసరమని.. అందుకే 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా వీటిని సబ్సిడీపై అందించేలా చూస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేశారు. మూడు మండలాలకు చెందిన 840 మంది రైతులకు ఇవి మంజూరు కాగా.. బుధవారం రోజు 214 మంది రైతులకు వీటిని అందజేశారు. వీటి విలువ రెండు కోట్ల 60 లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఇందులో అనంతపురము రూరల్ మండలంలో 195 మందికి, ఆత్మకూరు మండలంలో 314 మందికి, రాప్తాడు మండలంలో 331 మంది రైతులకు వీటిని మంజూరు చేశారు. రాప్తాడు మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, అధికారులు, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. మరోవైపు ఈ మూడు మండలాలకు చెందిన రైతులకు పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను కూడా మంజూరు చేశారు.అనంతపురం రూరల్ మండలంలో 54మందికి, ఆత్మకూరు మండలంలో 55 మందికి, రాప్తాడు మండలంలో 20మందికి చొప్పున మొత్తం 129మందికి మంజూరు చేశారు. వీటిని అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రిప్పు, స్ప్రింక్లర్లను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇవి మంజూరు కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు ఎన్నికల చివరి ఏడాదిలో అరకొరగా మంజూరు చేశారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తోందన్నారు. అయితే ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ ఉంటుందని 10 ఎకరాలు ఉన్న రైతుకు 70% సబ్సిడీ ఉందన్నారు. 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా పూర్తిస్థాయిలో సబ్సిడీ అందించాలని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా త్వరలో డ్రిప్పు, స్ప్రింక్లర్లు 90శాతం సబ్సిడీపై మంజూరు చేసే విధంగా చేస్తామని సునీత అన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా చాలా ఆదాయం ఉంటుందని... ఇంటి వద్దనే ఉండి ఉపాధి పొందవచ్చున్నారు. ఒక యూనిట్ విలువ 6వేలు కాగా సబ్సిడీ రూ.3600 అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఇది పూర్తిగా రైతులు పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం అని ఆమె స్పష్టం చేశారు....

వైసీపీ శ్రేణులు ప్రకాష్ రెడ్డి ట్రాప్ లో పడవద్దు

అధికారంలో ఉండగా కనీసం గ్రామాలకు రోడ్లు కూడా వేయలేని ప్రకాష్ రెడ్డి... అధికారం పోయాక రాజకీయ కక్షలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా గ్రామాలకు రోడ్లు వేశామని.. ఇప్పటికే 30 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అలాగే బీటీ రోడ్లు కూడా పెద్ద ఎత్తున మంజూరు చేశామన్నారు. త్వరలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రకాష్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో ఇద్దరు వ్యక్తులు గొడవపడితే. అది పరిటాల కుటుంబం పై నెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇందులో ఇరు వర్గాలకు గాయాలయ్యాయని.. ఇరువర్గాల మీద కేసులు కూడా పెట్టారన్నారు. అలాంటప్పుడు పరిటాల కుటుంబం ప్రమేయం ఎక్కడ ఉందని ఆమె ప్రశ్నించారు. ప్రకాష్ రెడ్డి ఇంటి వద్దకు కనీసం కుక్కలు కూడా పోలేదని.. వైసీపీ శ్రేణులను తన వైపు తిప్పుకునేందుకు పరిటాల కుటుంబాన్ని మధ్యలోకి లాగుతున్నారని అన్నారు. ప్రకాష్ రెడ్డి ట్రాప్ లో పడితే వైసీపీ శ్రేణులు దెబ్బ తినే అవకాశం ఉందని.. ఆయన కుట్రలను ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. అధికారంలో ఉన్న సమయంలో పోలీసులను అడ్డం పెట్టుకుని మహిళలని కూడా చూడకుండా అక్రమ కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఇప్పుడుఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా పరిటాల కుటుంబాన్ని లాగుతున్నారని.. మరోసారి ఇలాంటివి జరిగితే ప్రకాష్ రెడ్డి పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.

## కంది పంటకు నిప్పు..

### – రూ. 3 లక్షలు ఆస్తి నష్టం

నల్లమాడ, మేజర్ న్యూస్: వేరుశనగ పంట సాగు చేస్తే నష్టాలు వస్తాయన్న భావనతో కంది సాగు చేసి తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు వస్తాయని ఆశించి కంది పంట సాగు చేస్తే అకతాయిలు చేసిన పనికి రెండు మూడు రోజుల్లో పంట నూర్పి డి చేద్దాం అనుకుంటున్నా సమయంలో అగ్నికి ఆహుతై కాలిపోయిన సంఘ టన మండలంలోని బొగ్గులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళితే.. గ్రామ సమీపాన ఉన్న కప్పు లక్క రాళ్ల చేను సర్వే నెంబర్ 24. 23 లలో పది ఎకరాలలో బి.నాగరాజు, సూరి బాబు, వెంకట లక్ష్మమ్మ అనే రైతులు చెందిన కంది పంట కాలి బూడిదైంది. విషయాన్ని కదిరి ఫైర్ స్టేషన్ అధికారులకు తెలియజేయడంతో ఫైర్ స్టేషన్ అధికా రులు వచ్చి గ్రామాన్ని సందర్శించి జరిగిన సంఘటన పరిశీ లించి ఫైర్ ఇంజన్ తో మంటలు ఆర్పడా నికి ప్రయత్నం చేసిన విఫలమైంది. అధికారులు స్పందించి నష్టపోయిన బాధిత రైతులు ఆదుకోవాలని కోరుతున్నారు.



## రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ పోలీస్‌కు గాయాలు

### నగరంలోని సూర్య నగర్ రోడ్డులో ఘటన



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని సూర్య నగర్ రోడ్డులో జరిగినా రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ పోలీస్ తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. శ్రీకంఠం సర్కిల్ నుంచి పాతూరు వైపుకు వెళు తున్న ద్విచక్ర వాహనా న్ని ఢీకొన్న ఆటో రోడ్డులో ట్రాఫిక్ నియంత్రిస్తున్న కానిస్టేబుల్ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రాఫిక్ పోలీస్ వీరాంజనేయులు, మరో వ్యక్తి రాఘవేంద్ర రెడ్డి కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అనంతలో ఉద్యానవన పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి

## - కనీస మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి :** అనంతపురము జిల్లాలో ఉద్యానవన పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లోవ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి ప్రైమరీ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులను ఉద్యానవన పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వ్యవసాయ మరియు అనుబంధ శాఖ అధికారులు తప్పనిసరిగా ప్రతి నెల రెండవ బుధవారం జరిగే ప్రైమరీ సెక్టర్ సమీక్ష సమావేశంలో పాల్గొని వారి వారి డిపార్ట్మెంట్ సంబంధించిన అన్ని కార్యక్రమాలు తెలియజేయ వలసిందిగా ఆదేశించారు.జిల్లాలో కనీస మద్దతు ధరతో కంది పంటను ఎటువంటి సమస్యలు లేకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జొన్న పంట, పప్పు సెనగ, వేరుశనగ పంటలను కనీస మద్దతు ధరతో కొనుగోలు కొరకు అనుమతి తీసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు చేసినటువంటి ఫలితాలను తెలియజేసే సాయిల్ హెల్త్ కార్డులను వ్యవసాయ మరియు అనుబంధ శాఖల కార్యక్రమంలో రైతులకు అందజేసి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో



ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధుల పర్యటన సందర్భంలో సాయిల్ హెల్త్ కార్డ్స్ లను వారి చేతుల మీదగా రైతులకు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులు గుర్తించి కౌలుదారున్ని హక్కు పత్రం ఇచ్చి వారికి ప్రభుత్వం నుంచి వచ్చేటువంటి పథకాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే వారికి నెలలోపు పంట రుణాలను కూడాఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతపురం జిల్లా ఉద్యానవన పంటల సాగుకు అనుకూలమైనది కావున నీటి వసతి కలిగినటువంటి రైతులకు ఉద్యానవన పంటలు సాగు చేసే విధంగా ఉద్యానవన పంట ప్రణాళికలను తయారుచేసి అమలు చేసే విధంగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దేశంలోని అధిక దిగుబడి మరియు ఆదాయం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపిఎమ్ఐపి ద్వారా రాయితీపై ఇచ్చేటువంటి బిందు సేద్య పరికరాలను ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం నందు ఎంఓయూలు చేసినటువంటి కంపెనీ, ఆ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి కంపెనీలతో మాట్లాడి జిల్లాలో వారి యొక్క కార్యక్రమాలు అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.సి ఎం అప్లికేషన్ ద్వారా పంటల మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తక్కువ ధర ఉన్నప్పుడు కనీస మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ యందు అమలవుతున్న అన్ని రకాల పథకాలను పాడి రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. ఏపిసిఎన్ఎఫ్ లో ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రతినెల రెండవ బుధవారం లో ప్రైమరీ సెక్టార్ మీటింగ్ జరిగిన తర్వాత కమిటీ మీటింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మరియు రెవెన్యూ శాఖలు కలిసి ప్రతి రైతులను రిజిస్ట్రేషన్ చేసి వారికి ప్రత్యేక సంఖ్యను కేటాయించడం జరుగుతుందని,తద్వారా భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖఅధికారి జిల్లా కలెక్టర్ కు తెలిపారుఈ సందర్భంగా ఉద్యాన శాఖ 2025 డైరీని, ప్లాంట్ డాక్టర్స్ డైరీ 2025ను, ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఫిషరీస్ డిడి శ్రీనివాస్ నాయక్, డిసిఓ అరుణకుమారి, ఏపీ మార్క్ఫెడ్ ఏడి పెన్నేశ్వరి,ఆత్మ పీడీ మద్దిలేటి, సిరికల్చర్, పశుసంవర్ధక శాఖ ఏడి,ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఎల్కేపీలో నరసింహమూర్తి వర్ధంతి..



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : లలిత కళా పరిషత్ అభివృద్ధి కోసం నరసింహమూర్తి విశేష కృషి చేశారని ఎల్కేపి కార్యదర్శి పద్మజ అన్నారు. బుధవారం నరసింహమూర్తి ఆరవ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక లలిత కళ పరిషత్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎల్కేపి ఉపాధ్యక్షులు సంగాల నారాయణస్వామి, రామ గోవిందు, సంయుక్త కార్యదర్శి శివశంకర్, కోశాధికారి రాజకుల్లాయప్ప వెంకటరెడ్డి పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్, మేజర్ న్యూస్: మున్సిపల్ పరిధిలోని నాగిరెడ్డి పల్లిలో నివా సము ఉంటూ కూలి పని చేసుకొని చేస్తూ జీవనము చేసే చెరువు అక్కులమ్మ సంవత్స రం క్రితము రూ. 50 వేల రూపాయల డబ్బులను దాచమని తన ఊరిలో నివాస ము ఉంటూ.. రాజకీ యంగా పెద్ద మనిషిగా వ్యవహరించే వ్యక్తి అయిన పి. రమణారెడ్డికి ఇచ్చినట్లు పేర్కొంది. మరలా ఆ డబ్బును ఆమె అడిగినప్పుడు తిరిగి ఇవ్వాలని అతనితో చెప్పింది. కానీ ఇప్పుడు, ఆమె తాను అతనికి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని ఆమె పి. రామారెడ్డిని అడు గగా, అందుకు అతను ఆమెతో తనకు డబ్బు ఇవ్వలేదని ఆమెకు సమాధానం చెప్పి మోసము చేసాడు అని ఇచ్చిన పిర్యాదు చేసింది.. ఈ మేరకు పి. రమణారెడ్డి పై కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు..

# కోలాహలంగా కొండమీద రాయుని రథోత్సవం

## - భక్తులతో పోటెత్తిన పురవీధులు - పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు







బుక్కరాయసముద్రం మేజర్ న్యూస్ : ప్రతి ఏటా కన్నుల పండుగలా నిర్వహించే శ్రీ కొండమీద వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం మాఘ శుద్ధపౌర్ణమి బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.వేకువ జామునే శ్రీ వెంకటరమణ సతీసమేత కళ్యాణోత్సవాన్ని పద్మావతి పుట్టింటి వారైనా పద్మశాలి సంఘ సమక్షంలో నిర్వహించారు.రథం ముందు వేద పండితులు గణపతి పూజ,హోమగుండ పూజ,పూర్ణాహుతి,మహా మంగళ హారతి నిర్వహించారు.అనంతరం సూర్యప్రభవానంపై వేద పండితులు ఉత్సవమూర్తులను మోసుకు వచ్చి రథంపై అలంకరించి భక్తిశ్రద్ధలతో రథోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.గోవిందా గోవిందా నామస్మరణలతో పురవీధులు మారు మ్రోగాయి. రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు.దేవరకొండ కింద ధర్మవరం భక్త



బృందం వారిచే, తాసిల్దార్ కార్యాలయం ముందు బేల్దారుల సంఘం వారిచే, మార్కండేయ గుడి వద్ద పద్మశాలి సంఘం వారిచే భక్తులకు అన్నదానం నిర్వహించారు.రెండవ విడత రథోత్సవం ను సాయంత్రం 4:30 లకు ప్రారంభించి, బ్రాహ్మణ వీధి వరకు రథాన్ని లాగి తిరిగి,యధాస్థానానికి తీసుకువస్తారు.సాయంత్రం 6 గంటలకు దేవరకొండపై అఖండ జ్యోతిని వెలిగిస్తారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ,పసుపుల రామిరెడ్డి, తాసిల్దార్ పుణ్యవతి,ఎంపీపీ దాసరి సునీత,మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి తదితర నాయకులు,అధికారులు, సంబంధిత ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.